RNI NO .TGTEL/25/A4366

## సినీ హీరో శివాజీ వ్యాఖ్యల్లో తప్పులేదు



-జానకీపురం మాజీ సర్పంచ్ నవ్య

3 లో


# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో పని చేయుటకు నియోజకవర్గాలవారీగా విలేకరులు కావలెను వాట్సాప్ నెం : 9959812941-9949356387


PUBLISHED: TELANGANA | సంపుటి : 01 | సంచిక :21 | శుక్రవారం 26 డిసెంబర్ 2025 | ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ | పేజీలు: 08 | వెల :05/-

## మాజీ సీఎం కేసీఆర్, సీఎం రేవంత్ రెడ్డి మధ్య లోపాయికారి ఒప్పందం: కేంద్ర మంత్రి బండి




తెలంగాణ రాజకీయాల్లో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మరోసారి నిప్పులు చెరిగారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి మధ్య లోపాయికారి ఒప్పందాలు సాగుతున్నాయంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. గురువారం మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్ చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాష ఏమాత్రం సరైంది కాదని, వీరిద్దరి మధ్య కుదిరిన రహస్య ఒప్పందంలో భాగంగానే కావాలనే కేసీఆర్‌పై సానుభూతి కలిగేలా రేవంత్ మాట్లాడుతున్నారా? అని బండి సంజయ్ అనుమానం వ్యక్తం చేశారు. కేసీఆర్ కంటే పెద్ద శని తెలంగాణకు ఎవరూ ఉండరని, కేటీఆర్‌కు అధికార పోయినా అహంకారం మాత్రం తగ్గలేదని బండి సంజయ్ ఎద్దేవా చేశారు.

అలాగే కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యంగా మంత్రుల పనితీరుపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్ర కేబినెట్‌లోని ఇద్దరు, ముగ్గురు మంత్రులు చట్టంలోని లొసుగులను ఆసరాగా చేసుకుని వేల కోట్ల రూపాయల అక్రమాలకు పాల్పడుతున్నారని, వారి అక్రమాలపై ఇప్పటికే ఇంటెలిజెన్స్ ద్వారా నివేదికలు తెప్పించుకుంటున్నామని సంచలన ఆరోపణలు చేశారు. త్వరలోనే మంత్రుల భాగోతాన్ని బయటపెడతామని, కాంగ్రెస్ అవినీతిపై బీజేపీ సమరశంఖం పూరిస్తుందని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి పాలన కూడా గత కేసీఆర్ బాటలోనే సాగుతోందని, జీవోలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టకుండా పారదర్శకతను కాలరాస్తున్నారని దుయ్యబట్టారు.

కేసీఆర్ కుటుంబంపై ధ్వజం

కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు జరిగిన అన్యాయానికి ముమ్మాటికీ కేసీఆరే కారణమని బండి సంజయ్ స్పష్టం చేశారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో బిగ్ డే..
### జూబ్లీహిల్స్ పీఎస్‌లో ఆ ఐదుగురు




ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణ నేటితో ముగియనుంది. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు డిసెంబర్ 19న ఆయన కస్టడీని ఇవాళ్టి వరకు పొడిగించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు డిసెంబర్ 12న జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన ప్రభాకర్ రావును హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ నేతృత్వంలోని 9 మంది స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ లోతుగా విచారిస్తోంది. అయితే, విచారణ చివరి రోజు కావడంతో కేసులో నిందితులైన ప్రణీత్ రావు, భుజంగ రావు, రాధాకిషన్ రావు, తిరుపతన్నలను సిట్ జూబ్లీహిల్స్ పీఎస్‌కు పిలిపించింది.

## అయోధ్యలో కొరియన్ రాణి హియో హ్వాంగ్-ఒక్ కాంస్య విగ్రహం




## దేశవ్యాప్తంగా సమ్మెకు దిగిన గిగ్ వర్కర్లు




## కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం మరింత దిగజారింది
స్టేట్ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు




## బంగ్లాదేశ్ రాజకీయాల్లో సంచలనం
మాజీ ప్రధాని షేక్ హసీనా పార్టీపై నిషేధం




## రష్యాలో -56 డిగ్రీల అత్యంత కనిష్ట ఉష్ణోగ్రత




## ఖతర్నాక్ కిలాడీ టీచర్..
ప్రియుడి కోసం భర్తను చంపి బడికి వెళ్లిన భార్య!"




## శంషాబాద్‌లో బోల్తాపడిన స్కూల్ బస్సు.. పలువురు విద్యార్థులకు గాయాలు




# రైతులకు సంక్రాంతి కానుక
## పండుగ పూట మరో పథకం ప్రారంభం

- ☑సంక్రాంతి కానుకగా రైతు యాంత్రీకరణ పథకం పునఃప్రారంభం
- ☑1.31 లక్షల మంది రైతులకు లబ్ధి కలగనున్న పథకం
- ☑2026 జనవరిలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం
- ☑సబ్సిడీపై ఆధునిక వ్యవసాయ యంత్రాలు అందించనున్న ప్రభుత్వం
- ☑గత ప్రభుత్వంలో నిలిచిపోయిన కేంద్ర పథకాల పునరుద్ధరణ
- ☑జనవరి తొలి వారంలో దరఖాస్తుల ప్రక్రియ పూర్తి లక్ష్యం
- ☑క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలపై అధికారుల పర్యటనలు
- ☑ఆయిల్ పామ్ సాగు విస్తరణతో రైతుల ఆదాయం పెంపు లక్ష్యం

రైతుల సంక్షేమం కోసం రేవంత్ సర్కార్ అనేక సంస్కరణలు, కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. మరీ ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో పట్టించుకోకుండా వదిలేసిన పథకాలను తిరిగి ప్రారంభిస్తోంది. ఈ క్రమంలో తెలంగాణ రైతాంగానికి రేవంత్ సర్కార్ శుభవార్త చెప్పింది. సంక్రాంతి పండుగ సందర్భంగా వారికోసం మరో పథకాన్ని అమలు చేయబోతున్నట్లు ప్రకటించింది. దీని ద్వారా 1,30,000 మంది లబ్ధి పొందుతారని అధికారులు ఆశిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన రైతు యాంత్రీకరణ పథకాన్ని తిరిగి ప్రారంభించాలని రేవంత్ సర్కార్ భావిస్తోంది. ఈ క్రమంలో వచ్చే సంవత్సరం సంక్రాంతి కానుకగా ఈ పథకాన్ని ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు.

మిగతాది 2 లో




## దేశంలో ఉగ్రవాద ముప్పు..
### హై అలర్ట్ ప్రకటించిన నిఘా వర్గాలు




మన దేశ సరిహద్దు దాటి ఉగ్రవాదులు భారతదేశంలోకి ప్రవేశించి విద్రోహ చర్యలకు పాల్పడే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు గట్టి హెచ్చరికలు జారీ చేశాయి. ముఖ్యంగా పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతుతో ఉగ్రవాదులు పంజాబ్ సరిహద్దుల గుండా చొరబడి సైనిక స్థావరాలు, రద్దీగా ఉండే ప్రాంతాలను లక్ష్యంగా చేసుకునే ప్రమాదం ఉందని మిలిటరీ ఇంటెలిజెన్స్ హెచ్చరించింది.

## మానసిక వికలాంగురాలి పై అత్యాచారం




మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలో మరో దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భూత్పూర్ మండలం కరివేన గ్రామానికి చెందిన అవివాహిత మానసిక వికలాంగురాలిని ఇటీవల కోతి కరవడంతో కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షల సందర్భంగా వైద్యులు ఆమె పరిస్థితిపై అనుమానం వ్యక్తం చేసి అదనపు పరీక్షలు నిర్వహించగా, బాధితురాలు గర్భం దాల్చినట్లు నిర్ధారించారు.

## డీకే.శివకుమార్‌లో నైరాశ్యం.. కార్యకర్తగా ఉంటే బెటర్ అంటూ కామెంట్




కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు డీకే.శివకుమార్ చాలా కృషి చేశారు. రాష్ట్రమంతా తిరిగి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారు. తీరా కాంగ్రెస్ విజయం సాధించాక సిద్ధరామయ్య ముఖ్యమంత్రి పదవిని తన్నుకుపోయారు. ఆ పదవిపై ఆశలు పెట్టుకున్న డీకే.శివకుమార్‌కు అడియాసలే మిగిలాయి.

ఇటీవలే కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల పాలన పూర్తి చేసుకుంది. దీంతో మిగిలిన రెండున్నరేళ్లైనా ముఖ్యమంత్రి కుర్చీ దక్కుతుందని ఆశ పెట్టుకున్నారు. హస్తినలో తిట్టవేసి హైకమాండ్ పెద్దలతో చర్చలు జరిపారు. అక్కడా కూడా ఫలితమివ్వలేదు. బెంగళూరులోకి షిఫ్ట్ అయి బ్రేక్‌ఫాస్ట్‌లుగా మారింది. ఒకసారి సిద్ధరామయ్య ఇంట్లో.. ఇంకోసారి డీకే.శివకుమార్ ఇంట్లో అల్పాహార విందులు జరిగాయి.కానీ పురోగతి లేదు. ఇటీవల సిద్ధరామయ్య అసెంబ్లీలో మాట్లాడుతూ.. ఐదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని ప్రకటించారు. దీంతో డీకే.శివకుమార్ గుండెలో పిడుగు పడినట్లైంది.

## ఒడిశాలో భారీ ఎన్‌కౌంటర్
### మావోయిస్టు అగ్రనేత గణేష్ ఉయికే హతం

ఒడిశాలోని కంధమాల్ జిల్లాలో గత 48 గంటలుగా సాగుతున్న భారీ యాంటీ నక్సల్ ఆపరేషన్‌లో మావోయిస్టు పార్టీకి పెను దెబ్బ తగిలింది. ఈ ఎన్‌కౌంటర్లలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు , ఒడిశా ఇన్-ఛార్జ్ గణేష్ ఉయికే (69) సహా మొత్తం ఐదుగురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. గురువారం ఉదయం చాకాపాడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంపా అటవీ ప్రాంతంలో ఎస్ఓజీ, సీఆర్‌పీఎఫ్ బలగాలు సంయుక్తంగా నిర్వహించిన గాలింపు చర్యల్లో ఈ ఎన్ కౌంటర్ జరిగింది. ఈ పోరులో గణేష్ ఉయికేతో పాటు ఇద్దరు మహిళా మావోయిస్టులు సహా మొత్తం నలుగురి మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గణేష్ ఉయికేపై ప్రభుత్వం రూ. 1.1 కోట్ల భారీ రివార్డు ప్రకటించడం ఆయన ప్రాముఖ్యతను చాటుతోంది.

కీలక నేతల హతం – ఆయుధాల స్వాధీనం




తెలంగాణలోని నల్గొండ జిల్లా చండూరు మండలానికి చెందిన గణేష్ ఉయికే (అలియాస్ పాకా హనుమంతు) దశాబ్దాలుగా మావోయిస్టు ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దుల్లో కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్న ఆయన మృతి, ఆ పార్టీకి తీరని లోటుగా భావిస్తున్నారు. ఈ ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం నుండి భద్రతా బలగాలు రెండు ఇన్సాస్ రైఫిళ్లు, ఒక 303 రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నాయి.

# దేశంలో ఉగ్రవాద ముప్పు.. హై అలర్ట్ ప్రకటించిన నిఘా వర్గాలు

మొదటి పేజీ తరువాయి ఈ నేపథ్యంలో పంజాబ్ పోలీసులు, సరిహద్దు భద్రతా దళం సమన్వయంతో సరిహద్దు ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు.

పఠాన్‌కోట్, గురుదాస్‌పూర్ వంటి సున్నిత ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించి, రహదారులపై ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకల ఘనంగా జరుగుతున్న నేపథ్యంలో ఢిల్లీ, ముంబై, కోల్‌కతా వంటి మెట్రో నగరాల్లో కూడా పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. పండగ సీజన్‌లో జనసందోహం ఎక్కువగా ఉండే మాల్స్, చర్చిలు, మార్కెట్లు, రైల్వే స్టేషన్ల వద్ద భద్రతను రెట్టింపు చేశారు.

ఇటీవల ఢిల్లీ, మహారాష్ట్రలో ఐఎస్ఐఎస్ అనుబంధ మాడ్యూల్స్‌పై జరిగిన దాడుల్లో కొందరు ఉగ్రవాదులు అరెస్టయిన నేపథ్యంలో, స్లీపర్ సెల్స్ కార్యకలాపాలపై నిఘా వర్గాలు డేగ కన్ను వేశాయి. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు కోరారు.

# అయోధ్యలో కొరియన్ రాణి హియో హ్వాంగ్-ఒక్ కాంస్య విగ్రహం

కొరియన్ రాణి హియో హ్వాంగ్ ఒక్ కాంస్య విగ్రహాన్ని అయోధ్యలో స్థాపించారు. ఇండో కొరియన్ చారిత్రక సంబంధానికి గుర్తుగా ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నిజానికి హియో హ్వాంగ్ ఒక్ అయోధ్యలోనే జన్మించగా అప్పట్లో ఆమెను సురిరత్న రాజకుమారి అని పిలిచేశారు. క్రీ.శ 48లో సముద్రమార్గంలో కొరియాకు వెళ్లి గయా రాజ్య స్థాపకుడు అయిన రాజు సురోను వివాహం చేసుకున్నారు. హియో భారతీయ సంస్కృతి మరియు బౌద్ధ ధర్మాన్ని కొరియాకు పరిచయం చేశారు. అయితే నేటికీ కొరియాలోని కరక్ వంశానికి చెందిన లక్షలాది మంది ఆమెను తమ పూర్వజన్మగా విశ్వసిస్తున్నారు. అంటే కిమ్ అనే పేరు ఉన్న కొరియన్లు అంతా హియో వారసులే అని చెప్పుకుంటారు. అంతే కాకుండా ప్రతి ఏడాది అనేకమంది కొరియన్ దేశస్తులు అయోధ్యను తమ మాతృభూమిగా భావిస్తూ వచ్చి వెళుతుంటారు.

# ఒడిశాలో భారీ ఎన్‌కౌంటర్.. మావోయిస్టు అగ్రనేత గణేష్ ఉయికే హతం

మొదటి పేజీ తరువాయి అంతకుముందు బుధవారం రాత్రి కూడా గుమ్మా అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో బారి అలియాస్ రాకేష్ (ఏసీఎం), అమృత్ అనే ఇద్దరు మావోయిస్టులు హతమయ్యారు. వీరిద్దరిపై రూ. 23.65 లక్షల రివార్డు ఉంది.

ఈ ఆపరేషన్‌ను ఒడిశా పోలీస్ డీఐజీ (ఆపరేషన్స్) అఖిలేశ్వర్ సింగ్ మరియు కంధమాల్ ఎస్పీ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. సుమారు 23 బృందాలు ప్రస్తుతం కంధమాల్, గంజం సరిహద్దు అడవులను జల్లెడ పడుతున్నాయి. కేవలం రెండు రోజుల క్రితమే 22 మంది మావోయిస్టులు డీజీపీ ముందు లొంగిపోయిన నేపథ్యంలో, ఈ వరుస ఎన్‌కౌంటర్లు మావోయిస్టు శ్రేణులను పూర్తిగా బలహీనపరిచాయి. 2026 మార్చి నాటికి దేశాన్ని నక్సల్స్ రహితంగా మార్చాలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా ఈ దాడులు కొనసాగుతున్నాయని అధికారులు స్పష్టం చేశారు.

# దేశవ్యాప్తంగా సమ్మెకు దిగిన గిగ్ వర్కర్లు

దేశవ్యాప్తంగా స్విగ్గీ, జోమాటో, జెప్టో, బ్లింకిట్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ప్లాట్‌ఫారమ్‌లకు పనిచేసే గిగ్ వర్కర్లు సమ్మెకు దిగారు. దేశవ్యాప్తంగా క్రిస్మస్, న్యూ ఇయర్ రోజున సమ్మెకు పిలుపునిచ్చారు. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్-బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ నేతృత్వంలో జరుగుతున్న ఈ సమ్మెకు పని సమయాలు ఎక్కువగా ఉండటం,, వేతనాలు తగ్గడం, భద్రత లేకపోవడం వంటి కారణాలుగా చెబుతున్నారు వర్కర్లు.

10 నిమిషాల డెలివరీ మోడల్ రద్దు చేయాలని, న్యాయమైన వేతనాలు ఇవ్వాలని, పారదర్శక ఇన్‌సెంటివ్‌లు, హెల్త్ ఇన్సూరెన్స్ వంటి సామాజిక భద్రత, ఐడీ బ్లాకింగ్-పెనాల్టీలు ఆపడం, విశ్రాంతి సమయాలు వంటి డిమాండ్లతో ఈ నిరసన జరుగుతోంది. కర్ణాటక గిగ్ వర్కర్ల సామాజిక భద్రత చట్టం 2025 అమలు కాకపోవడంపై అక్కడి యూనియన్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ ఇతర రాష్ట్రాల్లో లక్షలాది వర్కర్లు పాల్గొనే ఈ సమ్మె వల్ల ఈ రెండు రోజుల్లో ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ సేవలు తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది.

# ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో బిగ్ డే.. జూబ్లీహిల్స్ పీఎస్‌లో ఆ ఐదుగురు

మొదటి పేజీ తరువాయి దీంతో ఒకేసారి అందరికీ ప్రశ్నలు సంధిస్తూ సమాధానాలు రాబడుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు మెజారిటీ ప్రశ్నలకు "నో" అనే సమాధానం ఇచ్చారని సమాచారం.

ఇక ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావును ఏ ప్రశ్న అడిగినా.. మాజీ డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్‌లు నవీన్ చంద్, అనిల్ కుమార్ పేర్లను మాత్రమే ప్రస్తావిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇక ఫోన్ ట్యాపింగ్ చేసిన 6 వేల ఫోన్ నంబర్లు ఉన్న పెన్‌డ్రైవ్‌పై ప్రభాకర్ రావు నోరు మెదపనట్లుగా తెలుస్తోంది. ఎవరి ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్ చేశారు, రాజకీయ నేతల పాత్రపై ఆరా తీయగా ప్రభాకర్ రావు మాజీ మంత్రి హరీశ్ రావు పేరును ప్రస్తావించినట్లుగా సమాచారం. మావోయిస్టుల నుంచి ఆయనకు ప్రమాదం పొంచి ఉందని, ఆ విషయంపైనే ఫోన్ ట్యాపింగ్ విషయంలో హరీశ్ రావుతో చర్చించినట్లుగా విచారణలో ప్రభాకర్ రావు చెప్పారనే విషయం బయటకు పొక్కింది. కస్టోడియల్ విచారణ చివరి రోజు కావడంతో సిట్ అధికారులు డాక్యుమెంటేషన్ పనుల్లో నిమగ్నమయ్యారు.

## ఖతర్నాక్ కిలాడీ .. ప్రియుడి కోసం భర్తను చంపి బడికి వెళ్లిన భార్య!"

నాగర్‌కర్నూల్ జిల్లాలో వివాహేతర సంబంధం కోసం కట్టుకున్న భర్తనే కడతేర్చిన ఓ ప్రభుత్వ టీచర్ ఉదంతం కలకలం రేపుతోంది. అచ్చంపేట మారుతీనగర్‌లో నివాసముంటున్న లక్ష్మణ్ నాయక్, పద్మ దంపతుల మధ్య అక్రమ సంబంధం చిచ్చు రేపింది. బట్టుకాడిపల్లి తండా పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న పద్మకు, అదే స్కూల్‌లో పనిచేసే మరో ఉపాధ్యాయుడు రాత్లవత్ గోపీతో ఏర్పడిన పరిచయం కాస్తా వివాహేతర సంబంధానికి దారితీసింది. తమ ప్రేమాయణానికి భర్త లక్ష్మణ్ అడ్డుగా ఉన్నాడని భావించిన పద్మ, ప్రియుడు గోపీతో కలిసి అతి కిరాతకంగా ప్లాన్ వేసింది. నవంబర్ 25న నిద్రిస్తున్న లక్ష్మణ్‌ను ముక్కు, నోరు మూసి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు.

అయితే, ఈ దారుణానికి ఒడిగట్టిన తర్వాత ఏమీ తెలియనట్టుగా పద్మ స్కూల్‌కు వెళ్లిపోయింది. ఆపై ఇంటి యజమానికి ఫోన్ చేసి తన భర్త స్పృహ తప్పి పడిపోయాడంటూ డ్రామా ఆడింది. మొదట దీనిని అనుమానాస్పద మృతిగా భావించినప్పటికీ, పోలీసుల లోతైన దర్యాప్తులో అసలు నిజం బయటపడింది. పోస్ట్‌మార్టం నివేదిక మరియు కాల్ డేటా ఆధారంగా పద్మ, గోపీల బంధం బయటపడటంతో పోలీసులు వారిని నిలదీయగా నేరం అంగీకరించారు. విద్యా బుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులే ఇలాంటి ఘాతుకానికి పాల్పడటం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రస్తుతం నిందితులు పద్మ, గోపీలను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం మరింత దిగజారింది స్టేట్ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు

కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం మరింత దిగజారిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. ఇవాళ ఆయన రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయ్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల భాష ఏమాత్రం బాగోలేదని అన్నారు. మొన్న కేసీఆర్, నిన్న రేవంత్ రెడ్డి పెద్ద హోదాల్లో ఉండి ఇలాగేనా మాట్లాడేదని అన్నారు. రాజకీయాల్లో రాబోయే భవిష్యత్తు తరాలకు ఏం నేర్పిస్తున్నారని ఫైర్ అయ్యారు. పదేళ్ల పాటు పాలించిన కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని.. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం మరింత దిగజారిపోయిందని అన్నారు. ఎక్కడా అభివృద్ధి లేదని.. గ్రాఫిక్స్ మామతో చేయాలని చూస్తున్నారని కామెంట్ చేశారు.

# మానసిక వికలాంగురాలి పై అత్యాచారం

మొదటి పేజీ తరువాయి ఈ విషయంతో కుటుంబ సభ్యులు ఆమెను గట్టిగా ప్రశ్నించగా, పరమేశ్ అనే వ్యక్తి తనను బెదిరించి పలుమార్లు అత్యాచారం చేసినట్లు బాధితురాలు వెల్లడించింది. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఇప్పటికే వివాహితుడైన పరమేశ్‌ను నిలదీయగా, తానే కాకుండా మరికొందరు కూడా ఈ ఘాతుకానికి పాల్పడ్డారని అతడు చెప్పినట్లు సమాచారం.

అయితే బాధితురాలు మాత్రం తనకు జరిగిన అత్యాచారానికి పరమేశ్‌నే కారణమని స్పష్టంగా చెప్పినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో బాధితురాలిని వివాహం చేసుకోవాలని లేదా నష్టపరిహారంగా రూ.15 లక్షలు చెల్లించాలని కుటుంబ సభ్యులు తీర్మానించారు. మరోవైపు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పరమేశ్‌కు ఇప్పటికే వివాహం కాగా పిల్లలు ఉండటంతో రెండో వివాహానికి అతడు అంగీకరించలేదు. నష్టపరిహారంగా డబ్బులు చెల్లించేందుకు సిద్ధమని తెలిపినట్లు సమాచారం. ఈ ఘటనలో కొంతమంది మధ్యవర్తులు కలుగజేసుకోవడంతో చివరకు రూ.9 లక్షలకు ఒప్పందం కుదిరినట్లు తెలిసింది. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో గురువారం పంచాయతీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. ప్రస్తుతం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# బంగ్లాదేశ్ రాజకీయాల్లో సంచలనం మాజీ ప్రధాని షేక్ హసీనా పార్టీపై నిషేదం

బంగ్లాదేశ్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం , ప్రధాని పదవి కోల్పోయిన షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ పార్టీ కార్యకలాపాలపై నిషేధం కారణంగా ఫిబ్రవరి 2026న జరిగే జాతీయ పార్లమెంటరీ ఎన్నికల్లో పాల్గొనదని స్పష్టం చేసింది. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ముఖ్య సలహాదారు షఫీకుల్ ఆలం ప్రెస్ సెక్రటరీ మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశంలో రాజకీయ కార్యకలాపాలు నిషేధిందించబడిన అవామీ లీగ్ రాబోయే ఎన్నికల్లో పాల్గొనలేరు అని ప్రకటించారు.

అవామీ లీగ్ విషయంలో ప్రభుత్వ వైఖరి స్పష్టంగా ఉందని అన్నారు. అవామీ లీగ్ పార్టీ రిజిస్ట్రేషన్ రద్దు చేశారని చెప్పారు. ఆ పార్టీ నాయకులు అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ లో విచారణ ఎదుర్కొంటున్న కారణంగా ఆ పార్టీ మరియు దాని అనుబంధ సంస్థల అన్ని కార్యకలాపాలు నిషేదిస్తూ గెజిట్ నోటిఫికేషన్ సైతం జారీ చేశారు. ఇదిలా ఉంటే అవామీ లీగ్ ఎన్నికల బరిలో లేకపోతే అవి ఎన్నికలే కావనే విమర్శలు వస్తున్నాయి. ఇది యూనస్ కు పట్టాభిషేకం లాంటిదని పలువురు విమర్శిస్తున్నారు.

# మాజీ సీఎం కేసీఆర్, సీఎం రేవంత్ రెడ్డి మధ్య లోపాయికారి ఒప్పందం: కేంద్ర మంత్రి బండి

మొదటి పేజీ తరువాయి "తెలంగాణకు రావాల్సిన 575 టీఎంసీల వాటాను కాదని, కేవలం 299 టీఎంసీలకే అంగీకరించిన కేసీఆర్ రాష్ట్ర ద్రోహి" అని విమర్శించారు. నాటి అపెక్స్ కమిటీ సమావేశంలో జగన్మోహన్ రెడ్డి సమక్షంలో జరిగిన ఒప్పందాలను బయటపెట్టేందుకు తాము సిద్ధమన్నారు. తెలంగాణకు పట్టిన 'శని' కేసీఆర్ కుటుంబమేనని, ఆ కుటుంబం తప్ప రాష్ట్రంలో ఇంకెవరూ బాగుపడలేదని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ కుటుంబ ప్రమేయం స్పష్టంగా ఉందని, 6 వేల మంది ఫోన్లను ట్యాప్ చేసి ఎందరో జీవితాలను నాశనం చేశారని, తాము అధికారంలోకి వస్తే బాధ్యులందరినీ కచ్చితంగా జైలుకు పంపుతామని పునరుద్ఘాటించారు.

జీహెచ్ఎంసీ ఎన్నికలు - మజ్లిస్ ముక్త్ భాగ్యనగర్: రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేసి మేయర్ పీఠాన్ని దక్కించుకుంటుందని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. భాగ్యనగరాన్ని మజ్లిస్ పార్టీకి దారదత్తం చేయడానికి కాంగ్రెస్ ప్లాన్ చేస్తోందని, "మజ్లిస్ ముక్త్ భాగ్యనగర్" (మజ్లిస్ లేని హైదరాబాద్) తమ లక్ష్యమని ప్రకటించారు. కేంద్రం నుండి గ్రామ పంచాయతీలకు రూ. 3,005 కోట్లు వస్తున్నాయని, అయితే రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో పంచాయతీకి రూ. 5 లక్షలు ఇస్తామని చెప్పడం బిచ్చమేసినట్లు ఉందని ఎద్దేవా చేశారు. సగటున ఒక్కో పంచాయతీకి కోటి రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నిక కోసం తాము ఎదురుచూస్తున్నామని, బీజేపీ కార్యకర్తలు కసితో ఉన్నారని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు.

# రష్యాలో -56 డిగ్రీల అత్యంత కనిష్ట ఉష్ణోగ్రత

రష్యాలోని సఖా రిపబ్లిక్ (యాకుటియా) ప్రాంతంలో తీవ్రమైన చలి వణికిస్తోంది. అక్కడ ఇటీవల ఉష్ణోగ్రతలు మైనస్ 56 డిగ్రీల సెల్సియస్ వరకు పడిపోయాయి. ఇది భూమిపై నివాసిత ప్రాంతాల్లో నమోదైన అత్యల్ప ఉష్ణోగ్రతగా నిపుణులు పేర్కొన్నారు. ఆర్కిటిక్ ప్రాంతంలోని టిక్సీ గ్రామంలో మూడు రోజులుగా భారీ మంచు తుఫాను వీస్తోంది. దీనివల్ల పాఠశాలలు, కిండర్‌గార్టెన్‌లు మూసివేశారు. ఇళ్ల ముందు మంచు పేరుకుపోవడంతో చాలా మంది బయటకు రావలేక ఇళ్లలోనే ఉంటున్నారు. బలమైన గాలులు, మంచు కారణంగా బయట తిరగడం చాలా కష్టం అయ్యింది. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మైనస్ 60 డిగ్రీల వరకు పడిపోవచ్చని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. యాకుటియా 'పోల్ ఆఫ్ కోల్డ్'గా ప్రసిద్ధి అయిన ప్రాంతమే అయినా, ఈసారి చలి తీవ్రత మరింత అధికంగా ఉంది.

## మాకు ఓటేస్తే.. థాయ్‌లాండ్ ట్రిప్, బంగారం, ఎస్‌యూవీ : ఓటర్లకు అభ్యర్థుల ఎన్నికల హామీలు

సాధారణంగా ఎన్నికలు వచ్చాయంటే అభ్యర్థులు ఓటర్ల ను ఆకర్షించేందుకు పలు పథకాలు, బహుమతులు, హామీలూ ప్రకటిస్తుంటారు. తాజాగా పూణె మున్సిపల్ ఎన్నికలు ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. అందుకు కారణంగా అక్కడి ఓటర్లకు అభ్యర్థులు ఇచ్చిన హామీలే. గెలుపే లక్ష్యంగా ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు ఖరీదైన కానుకలను ప్రకటిస్తున్నారు. విదేశీ ట్రిప్పులు, బంగారు ఆభరణాలు, లగ్జరీ కార్లు వంటి ఉచితాలతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

పూణె మున్సిపల్ ఎన్నికలకు మరో మూడు వారాల సమయం ఉంది. అధికారం కోసం పోటీ పడుతున్న కౌన్సిలర్లు ఓటర్లను ఆకర్షించేందుకు పలు హామీలు ఇస్తున్నారు. లోహ్‌గావ్-ధనోరి వార్డులో ఓ అభ్యర్థి లక్కీ డ్రా నిర్వహించారు. ఈ డ్రా ద్వారా 11 మంది ఓటర్లకు ఒక్కొక్కరికి 1,100 చదరపు అడుగుల భూమిని ఇస్తానని హామీ ఇచ్చారు. ఇందుకోసం రిజిస్ట్రేషన్ కూడా ప్రారంభమైంది.

ఇక విమన్ నగర్‌లో అభ్యర్థులు ఓ అడుగు ముందుకేసి ఓటర్లకు విదేశీ ట్రిప్పును ప్రకటించారు. తమకు ఓటు వేసి గెలిపిస్తే ఐదు రోజులపాటూ థాయ్‌లాండ్‌కు లగ్జరీ టూర్‌ను అందిస్తామని హామీ ఇచ్చారు. ఇక మరికొన్ని చోట్ల లక్కీ డ్రా ద్వారా ఖరీదైన ఎస్‌యూవీ కార్లు, ద్విచక్ర వాహనాలు, మహిళా ఓటర్లకు పైథానీ, పట్టు చీరలు, బంగారు, వెండి ఆభరణాలు వంటి హామీలతో ఓటర్లను ఆకర్షిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఓటర్లకు ఇప్పటికే బహుమతులను కూడా అందించినట్టు తెలుస్తోంది. కొందరు కుట్టు మెషీన్లు, సైకిళు పంపిణీ చేశారు. ఇక క్రీడా ఔత్సాహిక ఓటర్ల కోసం రూ.లక్ష నగదు బహుమతితో క్రికెట్ లీగ్‌లు ఏర్పాటు చేశారు.

# శంషాబాద్‌లో బోల్తాపడిన స్కూల్ బస్సు.. పలువురు విద్యార్థులకు గాయాలు

స్కూలు బస్సు అదుపుతప్పి బోల్తా పడిన ఘటన రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. క్రిస్మస్ పండుగల వేళ రిషి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు స్కూలు బస్సులో హైదరాబాద్‌లోని జలవిహార్ కు వెళ్తున్నారు. ఈ క్రమంలోనే వారి బస్సును వెనుక నుంచి కారు ఢీకొట్టగా శంషాబాద్ సిగ్నల్ వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. అయితే, ఈ ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 60 మందికి పైగా విద్యార్థులు ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ ప్రమాదంలో పలువురు విద్యార్థులు గాయలైనట్లుగా సమాచారం. స్థానికుల సమాచారం మేరకు స్పాట్‌కు చేరుకున్న పోలీసులు సహాయక చర్యలను ముమ్మరం చేశారు.

# డీకే.శివకుమార్‌లో నైరాశ్యం.. కార్యకర్తగా ఉంటే బెటర్ అంటూ కామెంట్

మొదటి పేజీ తరువాయి తాజాగా డీకే.శివకుమార్ నైరాశ్యం వ్యక్తం చేశారు. పదవుల కంటే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా ఉండటమే తనకు ఇష్టమని వ్యాఖ్యానించారు. ఢిల్లీలోని కర్ణాటక భవన్‌లో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 1980 నుంచి పార్టీ కోసం అవిశ్రాంతంగా పని చేస్తూ వస్తున్నానని.. ఇప్పటికీ అదే కార్యకర్తగా ఉండేందుకు ఇష్టపడతానని చెప్పుకొచ్చారు. బ్రేక్‌ఫాస్ట్ సందర్భంగా ఎలాంటి చర్చలు జరిగాయో చెప్పలేనన్నారు. సంక్రాంతి తర్వాత పవర్ షేరింగ్ ఉండొచ్చా? అని అడిగిన ప్రశ్నకు అలాంటి వార్తలు మీడియాలోనే వస్తాయని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం నాయకత్వ మార్పు అంశాలపై విదేశాల నుంచి వచ్చిన రాహుల్ గాంధీని ఇబ్బంది పెట్టదల్చుకోలేదని స్పష్టం చేశారు.

# రైతులకు సంక్రాంతి కానుక పండుగ పూట మరో పథకం ప్రారంభం

మొదటి పేజీ తరువాయి 2026, జనవరిలో ఈ పథకాన్ని పునఃప్రారంభించనున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ పథకాన్ని ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ పథకాన్ని తిరిగి పునరుద్ధరించడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,31,000 మంది రైతులకు మేలు కలగనుంది. ఈ పథకం కింద అర్హులైన రైతులకు సబ్సిడీపై ఆధునిక వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు అందించాలని కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్ర ప్రభుత్వ పథకాలను పునరుద్ధరించడంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

తాజాగా బుధవారం మంత్రి తుమ్మల.. సచివాలయంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో కీలక అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వంలో నిలిపివేసిన కేంద్ర ప్రభుత్వ పథకాలను ఒక్కొక్కటిగా పునరుద్ధరిస్తున్నామని, ఇప్పటికే జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా పప్పుదినుసుల విత్తనాలను సబ్సిడీపై అందించామని గుర్తుచేశారు. జనవరి మొదటి వారంలో రైతు యాంత్రీకరణ పథకాన్ని ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

ఈ పథకం కోసం.. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, జనవరి నెలలోగా ఈ ప్రక్రియను పూర్తిచేసి, రైతులకు ఆధునిక యంత్రాలు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. జనవరి తొలి వారంలో.. జిల్లా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు మండలాల్లో పర్యటించి.. ప్రభుత్వం నుంచి రైతులకు అందుతున్న సబ్సిడీలు, యూరియా యాప్, యాంత్రీకరణ పథకం దరఖాస్తుల వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించాలని సూచించారు. రైతుల సమస్యలను నేరుగా తెలుసుకుని తక్షణమే పరిష్కారాలు అందించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

రాష్ట్రంలో రైతులు దీర్ఘకాలిక ఆదాయం అందించే ఆయిల్ పామ్ వంటి పంటల సాగును ప్రోత్సహించాలని, కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా రైతులకు సబ్సిడీలు అందిస్తూ, ఆయిల్ పామ్ పంట విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచాలని అధికారులను ఆదేశించారు. ఇది రైతుల ఆదాయం పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

# మృత్యువును జయించిన దగ్గు మందు బాధిత బాలుడు.. కంటిచూపు కోల్పాయాడు



విషపూరిత దగ్గు మందు వల్ల కిడ్నీలు దెబ్బతినడంతో మధ్యప్రదేశ్‌లో 24 మంది పిల్లలు మరణించిన సంగతి తెలిసిందే. అయితే ఒక బాలుడు మృత్యువును జయించాడు. మూత్రపిండాలు దెబ్బతిన్న ఆ చిన్నారి మూడు నెలలకుపైగా ప్రాణాలతో పోరాడాడు. అయితే ప్రాణాలు దక్కించుకున్నప్పటికీ కంటిచూపు, కదలికను కోల్పోయాడు. చింద్వారా జిల్లాలోని జాతచ్చపర్ గ్రామానికి చెందిన ఐదేళ్ల కునాల్ యదువంశి ఆగస్ట్ 24న జ్వరం, దగ్గుతో బాధపడ్డాడు. డాక్టర్ సూచన మేరకు 'కోల్డ్‌రిఫ్' దగ్గు సిరప్‌ను తల్లిదండ్రులు తాగించారు.

కాగా, ఆ తర్వాత బాలుడు కునాల్ ఆరోగ్యం క్షీణించింది. విషపూరిత దగ్గు మందు వల్ల ఆ చిన్నారి రెండు మూత్రపిండాలు దెబ్బతిన్నట్లు వైద్యపరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. బాలుడి ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారడంతో ఆగస్టు 30న నాగ్‌పూర్‌కు రిఫర్ చేశారు. ఎయిమ్స్ నాగ్‌పూర్‌తో సహా పలు ఆసుపత్రుల్లో కునాల్‌ను అతడి తండ్రి చేర్చాడు. ఆ బాలుడు బతికే అవకాశాలు చాలా తక్కువ అని డాక్టర్లు చెప్పారు.

మరోవైపు బాధాకరమైన రోజువారీ డయాలసిస్‌ను నెలరోజులపాటు కునాల్‌కు కొనసాగించారు. 115 రోజుల ఇంటెన్సివ్ చికిత్స తర్వాత ఆ బాలుడు మృత్యువును జయించి ఇంటికి తిరిగి చేరుకున్నాడు. అయితే దగ్గు సిరప్ విష ప్రభావం వల్ల కంటిచూపు కోల్పోయాడు. అలాగే నాడీ వ్యవస్థపై ప్రభావం వల్ల సరిగ్గా నడవలేకపోతున్నాడు. అయితే మృత్యువును జయించిన మాదిరిగానే దీర్ఘకాలిక వైద్య సంరక్షణ, పునరావాసంతో ఆ బాలుడి నడక మెరుగుపడవచ్చని డాక్టర్లు, తల్లిదండ్రులు ఆశిస్తున్నారు.

# కిలిమంజారో పర్వతంపై కూలిన హెలికాప్టర్.. ఐదుగురు మృతి



టాంజానియా లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కిలిమంజారో పర్వతం పై ఓ హెలికాప్టర్ కుప్పకూలిపోయింది. ఈ ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని ఆ దేశ పౌర విమానయాన శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. కిలిమంజారో పర్వతంలోని బరాఫు శిబిరం సమీపంలో హెలికాప్టర్ కూలిపోయినట్లు పేర్కొంది. మృతుల్లో ఓ గైడ్, వైద్యుడు, పైలట్, ఇద్దరు విదేశీ పర్యాటకులు ఉన్నట్లు తెలిపింది. ప్రమాద సమాచారం అందుకున్న అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. కాగా, ఆఫ్రికాలోనే ఎత్తైన శిఖరం కిలిమంజారో పర్వతం సముద్ర మట్టానికి దాదాపు 6,000 మీటర్ల ఎత్తులో ఉంటుంది. ఏటా దాదాపు 50 వేల మంది పర్యాటకులు ఈ పర్వతాన్ని ఎక్కుతుంటారు. ఇక తాజా ఘటనపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

# దేశంలోని సామాజిక అసమానతలకు మూలం మనుస్మృతే

## మనువాదం అశాస్త్రీయం-రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

## బీజేపీ-ఆర్ఎస్ఎస్ దేశానికి ప్రమాదకరం

## కెవిపిఎస్,సామాజిక ప్రజాసంఘాల నేతలు




ప్రపంచంలో ఎక్కడా లేనంతగా భారతదేశంలో సామాజిక అసమానతలు,కుల వివక్షలను సృష్టించిన గ్రంథం మనుధర్మశాస్త్రమేనని,అది పూర్తిగా ఆశాస్త్రీయమైనదని కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు నాగార్జున తీవ్రంగా విమర్శించారు.1927 డిసెంబర్ 25న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మహారాష్ట్రలోని రాయగడ్ జిల్లాలో వేలాది దళిత-బహుజనులతో కలిసి మనుధర్మశాస్త్రాన్ని దగ్ధం చేసిన చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకొని,గురువారం నల్లగొండ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్)ఆధ్వర్యంలో మనుధర్మశాస్త్ర ప్రతులను దగ్ధం చేశారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ విద్యావంతుల వేదిక,తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం,ప్రగతిశీల యువజన సంఘం,మాల మహానాడు తదితర సామాజిక ప్రజాసంఘాలు మద్దతు పలికాయి.

“మనుస్మృతే అన్ని వివక్షలకు మూలం: ఈ సందర్భంగా పాలడుగు నాగార్జున మాట్లాడుతూ..వేల సంవత్సరాలుగా ప్రజల మధ్య సామాజిక అంతరాలు సృష్టించిన అసంబద్ధమైన,అనాగరిక ఆలోచనలకు మూలం మనుస్మృతేనని అన్నారు.మెజార్టీ ప్రజలకు సహజంగా లభించాల్సిన భూమి,విద్య,ఆభరణాలు,ఆయుధాలు,అధికారాలను కొద్దిమంది చేతుల్లో కేంద్రీకరించేందుకు కర్మ సిద్ధాంతాన్ని ఆయుధంగా చేసుకొని బ్రాహ్మణీయ మనువాద శక్తులు ఈ దేశంలో అమలు చేస్తున్నాయని విమర్శించారు.మనుస్మృతి




భావాలను తుదముట్టించకపోతే దేశంలో అసమానతలు,వివక్షలు,దోపిడీ వంశపారంపర్యంగా కొనసాగి,కొందరు కోటీశ్వరులుగా,కోట్లాది మంది బిక్కచులుగా మిగిలే ప్రమాదం ఉందన్నారు.రూపాలు మారినా సారం మారలేదని,బ్రాహ్మణాధిపత్యాన్ని కాపాడటానికి,దోపిడీ వ్యవస్థను రక్షించడానికే మనువాదం పుట్టిందని స్పష్టం చేశారు.బీజేపీ-ఆర్ఎస్ఎస్ దేశానికి ప్రమాదం

తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు పందుల సైదులు మాట్లాడుతూ..1950లో అమల్లోకి వచ్చిన భారత రాజ్యాంగం మనువాద మూలాలపై గట్టి దాడి చేసిందన్నారు.రాజ్యాంగం వల్ల ప్రజాస్వామ్యం,సామాజిక న్యాయం అమలులోకి వచ్చి కొన్ని వర్గాలకు హక్కులు లభించాయని చెప్పారు.ఈ మేరకు వచ్చిన స్వల్ప వెసులుబాటును కూడా అగ్రకుల సంపన్న వర్గాలు,వారి రాజకీయ ప్రతినిధులైన బీజేపీ-ఆర్ఎస్ఎస్ భరించలేకపోతున్నాయని ఆరోపించారు.“మనకెందుకు అంబేద్కర్ రాజ్యాంగం-మనుధర్మమే కావాలి”అని బీజేపీ నాయకుడు అనంతకుమార్ హెగ్డే చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ,ఇవన్నీ తిరిగి మనుధర్మాన్ని ప్రతిష్ఠించాలనే ప్రయత్నాలేనన్నారు.గోల్వాల్కర్ నుంచి మోహన్ భాగవత్ వరకు,శ్యామప్రసాద్ ముఖర్జీ నుంచి నేటి మోదీ వరకు ‘మనధర్మం’ పేరిట మనుధర్మాన్నే ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.మనువాదాన్ని పాతరేయాలి

తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం (టిపివైఎస్) జిల్లా అధ్యక్షులు మానుపాటి బిక్షం మాట్లాడుతూ,రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత చట్టం ముందు అందరూ సమానులనే భావన ఏర్పడిందన్నారు.అయితే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాజ్యాంగాన్ని బలహీనపరిచి,తిరిగి మధ్యయుగాల నాటి మనుస్మృతిని అమలు చేయాలని చూస్తోందని ఆరోపించారు.దీని వల్ల మత వైషమ్యాలు,కుల ఘర్షణలు పెరిగి,సమాజం మరింత విచ్ఛిన్నమవుతుందన్నారు.దేశాన్ని ఐక్యంగా ఉంచాలంటే రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని,బహుజన ప్రజలంతా అప్రమత్తంగా నిలవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇందూరి సాగర్,మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గోలి సైదులు,గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్న,మాలల ఐక్యవేదిక జిల్లా నాయకుడు అద్దంకి రవీందర్,మాల మహానాడు జాతీయ కార్యదర్శి తెలగమల యాదగిరి,కెవిపిఎస్ పట్టణ కార్యదర్శి గాదె నరసింహ,సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఔట రవీందర్,డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# సినీ హీరో శివాజీ వ్యాఖ్యల్లో తప్పులేదు

## -జానకీపురం మాజీ సర్పంచ్ నవ్య




తెలుగు గళం న్యూస్ హన్మకొండ: హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం జానకిపురం గ్రామ మాజీ సర్పంచ్ నవ్య సినీ హీరో శివాజీ చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి తప్పు లేదని స్పష్టం చేశారు.సమాజంలో మహిళలు ధరించే వస్త్రధారణపై శివాజీ వ్యక్తపరిచిన అభిప్రాయాలు వాస్తవ పరిస్థితులకు అద్దం పడుతున్నాయని ఆమె పేర్కొన్నారు.ప్రస్తుత తరంలో కొంతమంది యువతులు సంప్రదాయాన్ని విస్మరించి అతి స్వేఛగా,అసభ్యంగా దుస్తులు ధరించడం సమాజానికి సిగ్గుచేటని ఆమె మండిపడ్డారు.ఆడదంటే గౌరవం,మర్యాద కలిగిన దేవతలా చూడాల్సిన అవసరం ఉందని సూచించారు.సమాజంలో అతి చిన్నదైన దుస్తులు ధరించడం వల్ల కొందరు కామాంధులు చెడు ద ృష్టితో చూడటం,దురాలోచనలకు పాల్పడే అవకాశం పెరుగుతోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.ఈ పరిస్థితులకు బాధ్యతాయుతమైన ఆలోచన అవసరమని తెలిపారు.శివాజీ తన వ్యాఖ్యలపై ఎవరికి క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదని,ఆయన చెప్పిన మాటల్లో ఎలాంటి తప్పిదం లేదని నవ్య స్పష్టం చేశారు.శివాజీపై అనవసరంగా ఒత్తిడి తెచ్చినా,ఇబ్బంది పెట్టినా తామంతా ఆయనకు అండగా నిలుస్తామని వెల్లడించారు.

# తమ్మడపల్లి జి గ్రామంలో

## “మన గ్రామం-మన పరిశుభ్రత”కార్యక్రమం



తెలుగు గళం న్యూస్ జఫరెఢ్ జనగామ జిల్లా జఫర్గడ్ మండలం తమ్మడపల్లి జి గ్రామంలో గ్రామ అభివ ృద్ధి కమిటీ చైర్మన్ అన్నం బ్రహ్మ రెడ్డి ఆదేశానుసారం గ్రామాన్ని పరిశుభ్రమైన,ఆరోగ్యకరమైన,ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో “మన గ్రామం-మన పరిశు భ్రత”కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని అన్ని వీధులు,ప్రధాన రహదారులు,పక్క రోడ్లను శుభ్రం చేయడంతో పాటు పొదలు,ముల్లు,చెత్తను తొలగించారు.ట్రాక్టర్ సహాయంతో మట్టి సమతలీకరణ పనులు చేపట్టి,ప్రజల రాకపోకలకు అడ్డుగా ఉన్న అడ్డంకులను తొలగించారు.ఈ కార్యక్రమం వల్ల గ్రామంలో పరిశుభ్రత పెరిగి వ్యాధుల నివారణకు దోహదపడుతుందని గ్రామపంచాయతీ సభ్యులు తెలిపారు.గ్రామానికి మంచి రూపు వచ్చిందని,ప్రతి కుటుంబానికి ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడిందని పేర్కొన్నారు.గ్రామ అభివ ృద్ధి అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని,ప్రతి నెలా “మన గ్రామం-మన పరిశుభ్రత” కార్యక్రమాన్ని కొనసాగిస్తూ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు క ృషి చేస్తామని తెలిపారు.

# ఆసియాలోనే రెండవ అతిపెద్ద చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

## -పాల్గొన్న ముగ్గురు ఎమ్మెల్యేలు



తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్: హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం కరుణాపురం గ్రామంలో ఉన్న ఆసియాలోనే రెండవ అతిపెద్ద చర్చిగా గుర్తింపు పొందిన క్రీస్తు జ్యోతి ప్రార్థన మందిరంలో క్రిస్మస్ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి,వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాయిని రాజేందర్ రెడ్డి,వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.క్రిస్మస్ వేడుకల సందర్భంగా ఆసియాలోనే ప్రసిద్ధి చెందిన ఈ ప్రార్థన మందిరంలో వివిధ దేశాల నుండి,వివిధ రాష్ట్రాల నుండి,అలాగే పలు జిల్లాల నుండి అత్యధిక సంఖ్యలో భక్తులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.వేలాదిగా చేరిన విశ్వాసులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించడంతో పరిసర ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు



మాట్లాడుతూ..శాంతి,ప్రేమ,కరుణ సందేశాన్ని ప్రపంచానికి అందించిన ఏసుక్రీస్తు బోధనలు నేటి సమాజానికి అత్యంత అవసరమని పేర్కొన్నారు.మత సామరస్యాన్ని కాపాడుకుంటూ,పరస్పర గౌరవంతో జీవించాల్సిన అవసరం ఉందని తెలిపారు.క్రిస్మస్ పండుగ ద్వారా సమాజంలో ఐక్యత మరింత బలపడుతుందని అన్నారు.అంతకుముందు చర్చి వ్యవస్థాపకులు పాస్టర్ పాల్సన్ రాజ్ మరియు పాస్టర్ ప్రకాష్ రాజ్లు ప్రత్యేక ప్రసంగాలు నిర్వహించి,ఏసుక్రీస్తు జన్మ ఉద్దేశ్యం మానవత్వం,సేవ,ప్రేమను ప్రపంచానికి చాటడమేనని వివరించారు.అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి,వేడుకలకు హాజరైన ఎమ్మెల్యేలను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో చర్చి ప్రతినిధులు,మహిళలు,యువత పెద్ద సంఖ్యలో పాల్గొని క్రిస్మస్ గీతాలు ఆలపిస్తూ వేడుకలను విజయవంతంగా నిర్వహించారు.భారీ భక్తజన సమూహం తరలివచ్చినప్పటికీ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా వేడుకలు శాంతియుతంగా ముగిశాయి.

# కాకా వెంకటస్వామి మెమోరియల్ టీ-20 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

## మ్యాచ్‌కు బ్యాటింగ్ చేసి శ్రీకారం చుట్టిన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి




తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్,డిసెంబర్ 25 హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న కాకా వెంకటస్వామి మెమోరియల్ టీ-20 క్రికెట్ టోర్నమెంట్ను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు.వరంగల్ జిల్లా మొగిలిచర్ల క్రికెట్ మైదానంలో జరిగిన ప్రారంభ మ్యాచ్‌లో వరంగల్-జనగామ జిల్లాల మధ్య పోరుకు ఎమ్మెల్యే స్వయంగా బ్యాటింగ్ చేసి టోర్నమెంట్‌కు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాకా కుటుంబం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడంలో ముందుండి,వారి ప్రతిభను వెలుగులోకి తీసుకురావడానికి క ృషి చేస్తోందని ప్రశంసించారు.గ్రామీణ స్థాయిలోని క్రీడాకారులకు ఇలాంటి టోర్నమెంట్‌లు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.డబ్ల్యుడీసీఏ జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ..ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒకేసారి మూడు టర్ఫ్ వికెట్లపై అన్ని వసతులతో మ్యాచ్‌లు




నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డబ్ల్యుడీసీఏ జిల్లా ఉపాధ్యక్షులు తోట రాము,సంయుక్త కార్యదర్శి బస్వరాజు ఉపేందర్,కార్యవర్గ సభ్యులు అభినవ వినయ్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.వంగాలపల్లి డబ్ల్యుడీసీఏ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో వరంగల్ జట్టు,జనగామ జట్టుపై విజయం సాధించింది.ఈ మ్యాచ్‌లో అదుతే ప్రదర్శన కనబరిచిన మణిదీప్కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.మొగిలిచర్ల మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో భూపాలపల్లి-మహబూబాబాద్ జట్లు తలపడగా,భూపాలపల్లి జట్టు గెలుపొందింది.కీలక పాత్ర పోషించిన నాగరాజుకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.ములుగు జిల్లా జాకారం వేదికగా జరిగిన మరో మ్యాచ్‌లో హనుమకొండ-ములుగు జట్లు పోటీపడగా,రోహిత్ రెడ్డి అత్యుత్తమ బ్యాటింగ్‌తో హనుమకొండ జట్టును విజయం దిశగా నడిపించారు.ఆయనకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందించినట్లు డబ్ల్యుడీసీఏ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు.

# ఉపసర్పంచ్‌ల ఫోరం రేగొండ మండల అధ్యక్షుడిగా ఎల్లండి నరేష్ ఏకగ్రీవ ఎన్నిక



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ రేగొండ మండల ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ఎల్దండి నరేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.గురువారం మండలంలోని బుగులోని వెంకటేశ్వర స్వామి జాతర ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో మండలానికి చెందిన 23 గ్రామపంచాయితీల ఉపసర్పంచ్‌లు పాల్గొని ఈ ఎన్నికను నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపసర్పంచ్‌ల హక్కులు, సమస్యలు, అభివృద్ధి అంశాలపై చర్చించిన అనంతరం ఉపసర్పంచ్‌ల ఫోరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు.ఫోరం గౌరవ అధ్యక్షుడిగా చుక్క జనార్ధన్,ఉపాధ్యక్షులుగా పెండెల శంకర్, ఆకుతోట తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా నీరటి రంజిత్, కార్యదర్శిగా గుర్రం రమేష్, కోశాధికారిగా గడల చిన్న సాంబయ్యలను ఎన్నుకున్నారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా గుర్రం రాంబాబు, రాజేష్, బండి వెంకటేష్, సకినాల రవీందర్ లను నియమించారు.ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడిగా ఎన్నికైన ఎల్దండి నరేష్ మాట్లాడుతూ, తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ఉపసర్పంచ్‌లందరికీ క ృతజ్ఞతలు తెలిపారు.ఉపసర్పంచ్‌ల సమస్యల పరిష్కారం, వారి హక్కుల సాధన, గ్రామాభివ ృద్ధి కార్యక్రమాల్లో క్రియాశీలక పాత్ర పోషించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశం ఉపసర్పంచ్‌ల మధ్య ఐక్యతను పెంపొందించడంలో కీలకంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.



## జర్నలిస్ట్ బాలకృష్ణ కుటుంబానికి నవీన్ రావు పరామర్శ



తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా. మరిపెడ మున్సిపాలిటీ కేంద్రం సీనియర్ జర్నలిస్ట్ బాలకృష్ణ సతీమణి సరిత ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతుంది. విషయం తెలుసున్న,జిల్లా గ్రంథాలయం మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు,గురువారం పరామర్శించారు. ఈ సందరరేగా అనారోగ్యానికి కలిగిన కారణాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని సూచించి ఆర్థిక సహాయం అందజేశారు, వారి వెంట పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకులు దిగజర్ల శ్రీనివాస్, బీ ఆర్ ఎస్ నాయకులు గంట్ల శ్రీనివాస్ రెడ్డి, కురవి మధు తదితరులు పాల్గొన్నారు.

## రేగొండ మండల కేంద్రంలో సంతాప వాతావరణం

### పత్తి బుచ్చి రెడ్డి తల్లి మృతి,కుటుంబాన్ని పరామర్శించిన ప్రముఖులు



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ: రేగొండ మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకులు, తెలంగాణ రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి బుచ్చిరెడ్డి తల్లి ఈరోజు ఉదయం అనారోగ్యంతో పరమదించారు.ఈ వార్తతో మండల కేంద్రంలో విషాద వాతావరణం నెలకొంది.మ ృతురాలి కుటుంబాన్ని పరామర్శించేందుకు రాజకీయ, సామాజిక సంఘాల నేతలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఈ సందరరేగా తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదన చారి మ ృతురాలి నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ దుఃఖ సమయంలో కుటుంబానికి ధైర్యం చెప్పి, మ ృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఇటువంటి నష్టం తీరనిదని పేర్కొంటూ, కుటుంబం ఈ కష్టకాలాన్ని అధిగమించేలా భగవంతుడు శక్తినివ్వాలని ఆకాంక్షించారు.అతని వెంట పలువురు పార్టీ నాయకులు, యువజన నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందరరేగా వారు కూడా తమ సానుభూతిని తెలియజేస్తూ, కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.అదేవిధంగా,రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్ రెడ్డి, రాష్ట్రా ఉపాధ్యక్షులు మాడుగుల పాపిరెడ్డి,జిల్లా నాయకత్వం బిల్లా రాజిరెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల సుమన్ రెడ్డి,మూలగుండ్ల విజేందర్రెడ్డి, గోగుల చంద్రకర్ రెడ్డి, గన్ రెడ్డి మనోహర్ రెడ్డి,గుటం లింగారెడ్డి,కొంకాల వెంకటరెడ్డి కూడా మృతురాలి కుటుంబాన్ని పరామర్శించింది.సంఘం తరపున నాయకులు మాట్లాడుతూ, సంఘ కార్యకర్త కుటుంబానికి ఇంతటి విషాదం కలగడం బాధాకరమని పేర్కొన్నారు.మ ృతురాలి సేవలు, కుటుంబ విలువలను గుర్తు చేస్తూ, కుటుంబ సభ్యులు ఈ దుఃఖాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలని తెలిపారు.



రెడ్డి సంక్షేమ సంఘానికి చెందిన యువజన విభాగం నాయకులు, జిల్లా స్థాయి ప్రతినిధులు, స్థానిక సంఘ సభ్యులు కలిసి మ ృతురాలికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, అవసరమైన అన్ని సందరాల్లో సంఘం తరపున పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావడంతో రేగొండ మండల కేంద్రంలో సంతాప వాతావరణం నెలకొంది. మ ృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని అందరూ ప్రార్థించారు.

## రేగొండ సీనియర్ కార్యకర్త పత్తి బుచ్చిరెడ్డి తల్లి అనారోగ్యంతో మృతి

### పార్థివ దేహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ: రేగొండకు చెందిన సీనియర్ కార్యకర్త పత్తి బుచ్చిరెడ్డి తల్లి పత్తి లక్ష్మీకాంతం అనారోగ్యంతో మ ృతి చెందారు.ఈ విషయం తెలిసిన వెంటనే భూపాలపల్లి మాజీ శాసనసభ్యులు గండ్ర వెంకటరమణ రెడ్డి మ ృతురాలి నివాసానికి చేరుకొని,పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందరరేగా గండ్ర వెంకటరమణ రెడ్డి మ ృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి,తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ ఈ కఠిన సమయంలో కుటుంబానికి ధైర్యం కలగాలని అన్నారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ రేగొండ మండల అధ్యక్షులు అంకం రాజేందర్, బీఆర్ఎస్ రేగొండ టౌన్ అధ్యక్షులు కోలేపాక బిక్షపతి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామల పాపిరెడ్డి, అలాగే గోగుల చంద్రకర్,గుర్రాల సుమన్ రెడ్డి తదితరులు పాల్గొని మ ృతురాలికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి తమ సానుభూతిని తెలియజేశారు.

## గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నాగరాజు



తెలుగు గళం న్యూస్ ఐనవోలు/డిసెంబర్ 25 హన్మకొండ జిల్లా ఐనవోలు మండల పరిధిలోని నందనం గ్రామంలో ఎమ్. జి.ఎన్. ఆర్. ఇ. జి.ఎస్. 20లక్షల రూపాయల నిధులతో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ఎమ్మెల్యేకేఆర్ నాగరాజు ప్రారంభించారు. ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు..అనంతరం నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా గ్రామపంచాయతీ భవనానికి స్థలం బహుకరించిన వారిని ఎమ్మెల్యే నాగరాజు గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు క్రిస్మస్ పర్వదినం సందర్భంగా క్రైస్తవ సోదర సోదరీమణులందరికి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామా పంచాయతీ భవాన ప్రహరీ గోడ తదితర వాటికి 10 లక్షల రూపాయల నిధులు మంజూరు చేస్తా అలాగే గ్రామంలో బడి, గుడి అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు అందిస్తా. మీ అందరికీ తెలుసు వర్ధన్నపేటలో 200 కోట్లతోని ఇంటిగ్రేటెడ్ యంగ్ ఇండియా స్కూల్ అంటే ప్రపంచంతో తలబడేంత ఇంటర్నేషనల్ అంగులతో త్వరలోనే పాఠశాల నిర్మాణం కాబోతుందన్నారు..త్వరలోనే మనకు మామునూరు ఎయిర్పోర్ట్ పనులు ప్రారంభమవ్వబోతున్నాయి ఇక్కడి నుంచి దేశ విదేశాలకు విమాన సర్వీసులు నడువనున్నది చుట్టుపక్కల ఉన్న మన స్థలం రేట్లు ఒక మూడు ఇంతలా నాలుగింతలు పెరిగిపోతుంది అన్ని ఇంటర్నేషనల్ కాబట్టి మన భూములను కాపాడుకోండి మీరు పరిరక్షించుకోండి తప్పనిసరిగా వాటి రేట్లు అంతకంటే కన్నతల్లి కంటే కన్న కొడుకు కంటే కూడా ఎక్కువ సంపాదించి పెడితే కాబట్టి భూమిలో ఉన్న మన సోదరులు రైతు సోదరులు జాగ్రత్తగా చూసుకోండి సమస్యలను కూడా అతి



త్వరలోనే రైతులకు దగ్గరుండి చేపించే బాధ్యత కూడా తీసుకుంటాడు. కోటి మంది మహిళలను కోటీశ్వరాలను చేయాలని సదు దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్ద పీటవేస్తూ వడ్డీలేని రుణాలు, సోలార్ పవర్, క్యాంటీన్, ఆర్టీసీ బస్సులకు ఓనర్లు చేస్తూ అరేయ్ మీ ఊరికి కూడా ఒక బస్సు ట్రిక్ వచ్చే విధంగా నా వంతు సహాయ సహకారాలు అందిస్తాన్నారు...నందనం నుంచి జగ్గయ్య గూడెం వరకు ఒక కోటి లక్షల రూపాయలు నిధులతో రోడ్డు మంజూరు అయిందన్నారు స్మశాన వాటికి కూడా నిధులు మంజూరు చేసామన్నారు. గత ప్రభుత్వం అప్పులకు తెలంగాణను వచ్చినా కూడా ఒక్కొక్కటిగా ఇచ్చిన సంక్షేమ పథకాలను అమలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళు తుందన్నారు. గ్రామ ప్రజలందరూ గ్రామ అభివ ృద్ధికి ఏర్పాటు చేస్తే ముందుకు వెళితే నా వంతు సహాయ సహకారాలు అందించడానికి మీరు సిద్ధంగా ఉన్నాను అన్నారు.. ఈ సందరరేగా ఎమ్మెల్యే నాగరాజు గ్రామంలో ఇటీవల ఎంబిబిఎస్ సీట్లు సంపాదించిన విద్యార్థులకు శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు.ఎంబిబిఎస్ సీట్లు సాధించిన విద్యార్థులకు క ృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జెట్టబోయిన రాజు, మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేష్ గౌడ్, సర్పంచ్ లు శంకర్ రెడ్డి, స్వాతి, దేవికరెడ్డి, తో పాటు మండల, గ్రామ స్థాయి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## క్రీస్తు సందేశం విలువలతో కూడిన బలమైన సమాజ నిర్మాణానికి పునాది

### నియోజకవర్గ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి: ఏసుక్రీస్తు బోధించిన ప్రేమ, క్షమ, దయ, సేవ వంటి విలువలు సమాజంలో శాంతి, సామరస్యం నెలకొల్పి బలమైన మరియు ఐక్యమైన సమాజాన్ని నిర్మించేందుకు మార్గదర్శకంగా నిలుస్తాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు.క్రిస్మస్ పండుగ సందర్భంగా గురువారం భూపాలపల్లి పట్టణంలోని మంజూరునగర్, సుభాష్ కాలనీ, కాకతీయ కాలనీ, కాశీంపల్లి, సీఆర్ నగర్, బాంబులగడ్డ, శాంతినగర్ ప్రాంతాల్లోని చర్చిల్లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందరరేగా ఆయా చర్చిల్లో కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని, క్రైస్తవ సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ,క్రిస్మస్ పండుగ మతాతీతంగా ప్రజలను ఏకం చేస్తూ, మానవ సంబంధాలను బలోపేతం చేసి, సామాజిక ఐక్యతను పెంపొందిస్తుందని పేర్కొన్నారు.క్రీస్తు సందేశం బలమైన సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తుందని,ప్రేమ మరియు శాంతి అనే యేసుక్రీస్తు బోధనలు ప్రజల మధ్య అనుబంధాన్ని పెంచి, సమాజంలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పుతాయని తెలిపారు.అలాగే,ఏసుక్రీస్తు బోధించిన ప్రేమ, క్షమ, దయ, సేవ వంటి క్రైస్తవ విలువలు సమాజానికి పునాదిలా నిలుస్తాయని వాటిని ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో అమలు చేస్తే సమాజం మరింత ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో వివిధ చర్చిల పాస్టర్లు, సంఘ నాయకులు, క్రైస్తవ సోదర సోదరీమణులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు





తెలుగు గళం న్యూస్ హాసన్ పర్తి /డిసెంబర్ 25: హనుమకొండ జిల్లా హన్మకొండ జిల్లా:హాసన్ పర్తి సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో క్రిస్మస్ పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించినారు. ఈ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు పాల్గొని కేక్ కట్ చేశారు. ఏసుప్రభువు ఆశీస్సులతో వర్ధన్నపేట నియోజకవర్గం అభివృద్ధి బాటలో మరింత ముందుకు తీసుకువెళ్తానని ఏసుప్రభు ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. క్రిస్టియన్స్ సోదరులకు ఈ సందర్భంగా క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## భాగిర్దిపేటలో శ్రీ వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ ప్రారంభం

### రైతులకు గిట్టుబాటు ధర,యువతకు ఉపాధి అవకాశాలు-ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ: రేగొండ మండలం భాగిర్దిపేట గ్రామంలో ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్‌ను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు (జీఎస్సార్) బుధవారం ఉదయం ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే, పరిశ్రమను ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ,రైతులు పండించిన ధాన్యానికి సరైన గిట్టుబాటు ధర లభించాలంటే గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి రైస్ మిల్లులు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు మరింతగా అవసరమని అన్నారు. కొత్తగా ప్రారంభమైన ఈ రైస్ ఇండస్ట్రీ ద్వారా స్థానిక రైతులకు ధాన్యం విక్రయానికి సౌకర్యం కలగడమే కాకుండా, రవాణా ఖర్చులు గణనీయంగా తగ్గి లాభం చేకూరుతుందని పేర్కొన్నారు.అదేవిధంగా, ఈ పరిశ్రమ ద్వారా స్థానిక యువతకు ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని,గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని ఎమ్మెల్యే తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేత ృత్వంలోని ప్రజా ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధికి అనుకూల విధానాలు అమలు చేస్తోందని,ఈ అవకాశాలను వినియోగించుకుని స్థానిక పెట్టుబడిదారులు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, రైతులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## యువరాజ్ జెంట్స్ షోరూమ్ ను ప్రారంభించిన కమర్తపు,కాటంనేని దంపతులు



ఖమ్మం, 25 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): ఇల్లందు క్రాస్ రోడ్ నందు, యువరాజ్ జెంట్స్ షోరూమ్ ను ప్రారంభించినందుకు సంతోషిస్తున్నామని ఇక్కడ రైమాండ్, లినెన్ క్లబ్, అరవింద్, సియారామ్స్, రాంరాజ్, రూబీ వంటి బ్రాండెడ్ ఐటమ్స్ దొరుకుతాయని, తెలిపారు . ప్రారంభోత్సవం సందర్భంగా అన్ని రకాల ఫాబ్రిక్స్ పై అప్ టు 20% ఆఫర్ ఉంటుందని కావున నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమర్తపు సరిత , 24వ డివిజన్ కార్పోరేటర్ కమర్తపు మురళి, కాటంనేని వీరభద్రం , కాటంనేని వనశ్రీ మరియు షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

# సాధిరెడ్డిపల్లి-ఓటాయి మధ్య చెరువు కట్టపై ట్రాక్టర్ బోల్తా

**డ్రైవర్ క్షేమంగా ఉన్నట్లు అనుమానం - పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది**



తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ కొత్తగూడ: కొత్తగూడ మండలంలోని సాధిరెడ్డిపల్లి–ఓటాయి గ్రామాల మధ్యలో ఉన్న చెరువు కట్టపై గురువారం రాత్రి ట్రాక్టర్ బోల్తా పడిన ఘటన చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం ప్రకారం, జంగవాణిగూడెం (రాంపూర్) గ్రామానికి చెందిన సనప జంపయ్య (తండ్రి: సారయ్య) ఈ ట్రాక్టర్‌ను నడిపిన వ్యక్తిగా గుర్తించారు.చెరువు కట్టపై ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయని స్థానికులు హెచ్చరించినప్పటికీ, డ్రైవర్ వాటిని పట్టించుకోకుండా రాత్రి సుమారు 10 గంటల సమయంలో వాహనంతో వెళ్లినట్లు తెలుస్తోంది.ఈ క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి చెరువు కట్టపై బోల్తా పడినట్లు సమాచారం.ఘటన జరిగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని, అలాగే డ్రైవర్ సురక్షితంగానే ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు.అయితే ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.ఈ ఘటనపై అధికారిక సమాచారం అందాల్సి ఉండగా, స్థానికులు చెరువు కట్టపై జరుగుతున్న పనుల దృష్ట్యా రాత్రి వేళ వాహనాల రాకపోకలపై నియంత్రణ అవసరమని కోరుతున్నారు.



# జెడ్.పి సెంటర్ లో అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ, ఎస్టీ, బీసీ బహుజన కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో, మనస్మూర్తులను తగలబెట్టి న దినం గా పాటిస్తూ, మనస్కృతులను, తగులబెట్టారు

ఖమ్మం, 25 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): ఖమ్మం నగరం అంబేద్కర్ సర్కిల్ లో ఎస్సీ, ఎస్టీ, బీసీ బహుజన కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో, మనువాదం కు వ్యతిరేకంగా ఈరోజు మనస్మూర్తులను తగలబెట్టి న రోజుగా ఈ కార్యక్రమానికి అధ్యక్షు లుగా అంబేద్కర్ ఆశయసాధకులు భోజన కులాల ఐక్యవేదిక గౌరవ అధ్యక్షులు గుంతటి వీరభద్రం, అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో, డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ దళిత రత్న తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు పాల్గొని, మాట్లాడుతూ, 1927 డిసెంబర్ 25 తేదీన అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ, బాబా సాహెబ్ అంబేద్కర్ అతని అనుచరులు కొందరు కలిసి మనస్మూర్తిని దహనం చేశారు. మహారాష్ట్ర కొంత ప్రాంతం రాయగడ్ జిల్లా లోని అనే చిన్న పట్టణంలో కొన్నివేల మంది సమక్షంలో ఈ దహన కార్యక్రమం జరిపారు ఈ గ్రామం ముంబైకి 150 కిలోమీటర్లు దూరంలో ఉంది అప్పటినుంచి దళితులు అంబేద్కర్ రిస్టులు ఆరోజును మనస్మూర్తి దినంగా పాటిస్తూ ఈ రోజును మనస్మృతులను, తగలబెడుతున్న దళిత సంఘాలు మరియు అంబేద్కర్ రిస్టులు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అంటరానితనానికి వ్యతిరేకంగా, మనుసంస్కృతులు తగలబెట్టిన రోజును, ఈరోజు మనం అంబేద్కర్ హిస్టులు గా, ఆయన ఆశయాలను కొనసాగిస్తూ, ఖమ్మం నగరంలో, ఈ కార్యక్రమం నిర్వహించడం ద్వారా మనువాదులకు తెలిసే విధంగా, ఎవరైతే దళిత బలహీన వర్గాలను, అంటరాని వారిగా చూస్తున్నారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమం ద్వారా వారికి గుణపాఠం తప్పదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దాసరి శ్రీనివాస్, ఎల్ .హెచ్.పి.ఎస్ రాష్ట్ర కార్యదర్శి బానోత్ భద్రు నాయక్, చర్మకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఇటికల లత, దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నకరికంటి సంజీవరావు, కొట్టే సుధాకర్, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా ఖమ్మం జిల్లా యువజన విభాగం అధ్యక్షులు జ్రిపోతుల నరేష్, అంబేద్కర్ సంక్షేమ నాయకులు కుక్కల రాములు, మహాత్మ జ్యోతిరావు పూలే ఐడియాలజీ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షులు బోట్ల సమ్మయ్య, మహాత్మ జ్యోతిరావు పూలే ఐడియాలజీ సొసైటీ జిల్లా కార్యదర్శి మల్లెల లక్ష్మణ్ పతి, మధు, అశోక్, వెంకన్న, తదితర నాయకులు పాల్గొన్నారు.





# వాజపేయి స్మరణలో పరుగులు తీసిన ఖమ్మం

## ఘనంగా అటల్ జీ శతజయంతి వేడుకలు ఖమ్మంలో ఉత్సాహంగా సాగిన 2కే రన్




ఖమ్మం, 25 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): భారత రాజకీయ యవనికపై చెరగని ముద్ర వేసిన ధ్రువతార, మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి, 100వ జయంతి (శతజయంతి) ఉత్సవాలను, పురస్కరించుకుని గురువారం ఖమ్మం నగరం ఘనంగా నివాళులర్పించింది. ఈ చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని నగరంలో భారీ 2కే రన్ ర్యాలీని నిర్వహించారు. దేశం గర్వించదగ్గ గొప్ప నాయకుడి ఆశయాలను స్మరిస్తూ, యువతలో స్ఫూర్తిని నింపే లక్ష్యంతో సాగిన,ఈ కార్యక్రమం నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంది.అటల్ బీహార్ వాజ్పేయి శత జయంతి ఉత్సవ సమితి అధ్యక్షులు, దిద్దుకూరు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి నేతృత్వంలో, ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం వేదికగా ప్రారంభమైన ఈ 2కే రన్ ర్యాలీ ఒక పండుగ వాతావరణాన్ని తలపించింది. ఉదయాన్నే స్టేడియం వద్దకు చేరుకున్న వందలాది మంది యువకులు, విద్యార్థులు, రాజకీయ నేతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ఆ ప్రాంతం కోలాహలంగా మారింది. వాజపేయి చిత్రపటాలతో, జాతీయ జెండాలతో అలంకరించిన, ఈ ర్యాలీని ప్రముఖులు జెండా ఊపి ప్రారంభించారు. సర్దార్ పటేల్ స్టేడియం నుంచి ప్రారంభమైన,ఈ రన్ నగరంలోని ప్రధాన వీధుల గుండా సాగుతూ, జిల్లా పరిషత్ సెంటర్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న బి.జె.పి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు, నల్గొండ జిల్లా ఇన్చార్జి మాజీ అధ్యక్షులు ఉదయ ప్రతాప్, తదితరులు వాజ్పేయి సేవలను గుర్తు చేశారు. అటల్ బిహారీ వాజపేయి కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదని, ఆయన ఒక గొప్ప కవి, దార్శనికుడు, దేశ భక్తుడని కొనియాడారు. ఆయన ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో దేశం అణుశక్తి రంగంలో, రవాణా రంగంలో సాధించిన ప్రగతి అద్భుతమని వారు గుర్తుచేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలను అనుసంధానించేలా ఆయన చేపట్టిన పథకాలు నేటికీ దేశాభివృద్ధికి వెన్నెముకగా నిలుస్తున్నాయని అభివర్ణించారు.ర్యాలీ సాగినంత పొడవునా "అటల్ జీ అమర్ రహే" అనే నినాదాలతో ఖమ్మం వీధులు మారుమోగాయి. యువత పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వాజపేయి చూపిన క్రమశిక్షణ, దేశభక్తి, నిబద్ధతను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని, అదే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అటల్ బీహార్ వాజ్పేయి రాష్ట్ర సమన్వయ కన్వీనర్ జి.విద్యాసాగర్, సుబ్బారావు, నంబూరు రామలింగేశ్వర రావు, కొత్త వెంకటేశ్వరావు, వీరెల్లి రాజేష్, సరస్వతి, రజినీ రెడ్డి, అనిత, అల్లిక అంజయ్య, జ్వాల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ గురై తండ్రి, కొడుకు మృతి





సూర్యాపేట, 25 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): ఇందిరమ్మ ఇల్లు నిర్మాణంలో భాగంగా పిల్లర్లకు, నీళ్లు కొడుతుండగా విద్యుత్ షాక్‌కు, గురై తండ్రి, కొడుకు మృతి చెందిన ఘటన గురువారం, చివ్వెంల,మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని,7జీ కాలనీలో నివాసం ఉంటున్న మాదాసు బుచ్చయ్య (48)కు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఇంటి నిర్మాణానికి బుధవారం, మట్టితోలింపు పనులు చేపట్టారు. గురువారం,సాయంత్రం పిల్లర్లకు నీళ్ల కొట్టేందుకు ట్రాక్టర్ ట్యాంకర్‌లోని మోటర్ వేసి, నీళ్ల కొడుతుండగా అకస్మాత్తుగా, నీటితో పాటు విద్యుత్ సరఫరా అయ్యి బుచ్చయ్య విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలాడు. కొద్ది నిమిషాల సమయంలోనే, అక్కడికి వచ్చిన చిన్న కుమారుడు మాదాసు లోకేష్ (22) ఈ విషయాన్ని గమనించకుండా ట్యాంకర్‌ను తాకడంతో అతడూ విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలిపోయాడు. స్థానికులు వెంటనే స్పందించి తండ్రి, కొడుకులను సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి అప్పటికే ఇద్దరూ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఒకే కుటుంబానికి చెందిన తండ్రి, కొడుకు,మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు.ఈ ఘటనతో కుటుంబంలో, గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# పాలడుగులో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



మోత్కూర్, 25 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలంలోని పాలడుగు గ్రామంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పాలడుగు గ్రామ సర్పంచ్ అంతటి భగవంతు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదినం ప్రేమ, సోదరభావం, శాంతి సందేశాన్ని అందరికీ గుర్తు చేస్తుందన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఐక్యతతో, పరస్పర గౌరవంతో జీవించాలన్నదే ఈ పండుగ సారాంశమని పేర్కొన్నారు

# జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన దత్తప్పగూడెం బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ నాయకులు



మోత్కూర్, 25 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): బిఆర్ఎస్ పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి జన్మదినం పురస్కరించుకొని అనారోగ్య కారణాల వల్ల నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న రామకృష్ణారెడ్డి ని పరామర్శించి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన దత్తప్పగూడెం బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ నాయకులు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎలుగు శోభ సోమయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు బండి వెంకటేష్, మాజీ రైతు కోఆర్డినేటర్ ఎలుగు సత్తయ్య, సీనియర్ నాయకులు గుండు యాదయ్య, మాజీ కో ఆప్షన్ మెంబర్ అశ్రఫ్ జానీ , వార్డు మెంబర్ బొడ్డు అవిలయ్య, మాజీ వార్డు మెంబర్లు మామిడి వెంకటేష్, ఎలుగు మచ్చగిరీ, నాయిని ఉపేందర్, ఎలుగు కిషోర్, ముంత గణేష్, వల్లపు సాయి, కంబాల ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# తక్కువ పెట్టుబడి- ఎక్కువ లాభం ఎర..

## ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ.33 లక్షలు చోరీ



ఏపీ న్యూస్, 25 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): తిరుపతి జిల్లాలో భారీ సైబర్ క్రైమ్ ఘటన వెలుగులోకి వచ్చింది. ఆన్‌లైన్ ట్రేడింగ్, ప్రీ–ఐపీఓ పెట్టుబడుల పేరుతో ఓ ప్రైవేట్ కంపెనీ ఉద్యోగిని నుంచి రూ.33.25 లక్షలు కాజేసిన ఘటన కలకలం రేపుతోంది. తిరుపతి రూరల్ మండలం పుదిపట్లకు చెందిన ఉద్యోగిని తాను సైబర్ మోసానికి గురయ్యానంటూ తిరుపతి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించింది. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ ద్వారా సంప్రదించి, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మబలికారు.. అనంతరం UHNWIs పేరుతో ఉన్న యాప్‌ను నా ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేయించినట్లు తెలిపారు. అయితే, యాప్‌లో మొదట ట్రేడింగ్ లాభాలను అధికంగా చూపించి, బాధితురాలికి నమ్మకం కలిగించారు. ఆ తర్వాత ప్రీ–ఐపీఓ పెట్టుబడుల పేరుతో విడతలుగా బ్యాంక్ ఖాతాల ద్వారా డబ్బులు బదిలీ చేయించుకున్నారు. లాభాలు వస్తున్నాయన్న భ్రమలో బాధితురాలు మొత్తం రూ.33.25 లక్షలు బదిలీ చేసినట్టు ఫిర్యాదులో తెలియజేసింది. డబ్బులు బదిలీ చేసిన తర్వాత, లాభాలు ఉపసంహరించుకోవాలంటే ముందుగా 20 శాతం కమిషన్, అలాగే అదనపు ప్రాసెసింగ్ చార్జీలు చెల్లించాలని సైబర్ నేరగాళ్లు డిమాండ్ చేశారు. మరింత డబ్బు పంపాలంటూ ఒత్తిడి తీసుకొచ్చారు. అనుమానం వచ్చి బాధితురాలు ప్రశ్నించగా.. ఫోన్ నంబర్లు, యాప్ సపోర్ట్ ఛానళ్ల నుంచి స్పందన రాలేదు.. దీంతో మోసం జరిగినట్టు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇక, ఫిర్యాదు అందుకున్న తిరుపతి సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. మోసానికి ఉపయోగించిన బ్యాంక్ ఖాతాలు, ఆన్‌లైన్ లింకులు, డిజిటల్ ట్రాన్సాక్షన్ల వివరాలను సేకరిస్తున్నారు. ఆయా ఖాతాల వెనుక ఉన్న వ్యక్తులు, నెట్‌వర్క్‌పై లోతుగా దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు. అయితే, తెలియని యాప్‌లు, అపరిచిత లింకులు ఇన్‌స్టాల్ చేయొద్దని సూచించారు. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అధిక లాభాల హామీలు నమ్మొద్దు.. డబ్బు పంపే ముందు ఖచ్చితమైన ధృవీకరణ చేసుకోవాలి. ఇలాంటి సైబర్ మోసాల పట్ల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

# బిషప్ హౌస్‌లో క్రిస్మస్ సంబరాలలో పాల్గొన్న తుంబూరు దయాకర్ రెడ్డి



ఖమ్మం, 25 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): ప్రేమ, కరుణల ప్రతిరూపం ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని, నగరంలోని కరుణగిరి బిషప్ హౌస్ గురువారం రాత్రి ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకలు, తేనీటి విందు సామాజిక సామరస్యానికి ప్రతీకగా నిలిచాయి. ఈ వేడుకల్లో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. బిషప్, ఇతర క్రైస్తవ మత పెద్దలతో కలిసి ఆయన కేక్ కట్ చేసి పండుగ సంబరాలను పంచుకున్నారు. అనంతరం దయాకర్ రెడ్డి మాట్లాడుతూ,లోక రక్షకుడైన క్రీస్తు చూపిన శాంతి మార్గం సర్వమానవాళికి ఆదర్శమని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తరపున క్రైస్తవ సోదరులందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.సందడిగా బిషప్ హౌస్.విద్యుత్ దీపాల అలంకరణలు, క్రిస్మస్ కేరల్స్ మధ్య బిషప్ హౌస్ ప్రాంగణం కోలాహలంగా మారింది. ఈ తేనీటి విందులో పలువురు రాజకీయ, సామాజిక ప్రముఖులు పాల్గొని ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పరస్పర ఆలింగనాలతో, చిరునవ్వులతో సాగిన ఈ వేడుక కరుణగిరిలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# మానవ శరీరంలో 'రెండవ గుండె'! దానివల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలివే



స్పోర్ట్స్ న్యూస్, 25 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): శరీరంలోని అతి ముఖ్యమైన అవయవాల్లో గుండె కూడా ఒకటనే విషయం అందరికీ తెలిసిందే. అయితే 'రెండవ గుండె' కూడా ఉంటుందని మీకు తెలుసా? అంటే ఇది నిజమైన హార్ట్ కాదు కానీ.. అంతటి ప్రాధాన్యత కలిగిన ఉన్నందున ఆ విధంగా పిలుస్తారు. అవే కాళ్లకు వెనుక భాగంలో ఉండే పిక్క కండరాలు. ఇవి గురుత్వాకర్షణకు వ్యతిరేకంగా గుండెకు రక్తాన్ని పంప్ చేయడంలో కీ రోల్ పోషిస్తాయి. అందుకే సెకండ్ హార్ట్ అంటారు. ఇది రక్త ప్రసరణను మెరుగు పరుస్తుంది. గుండెపై ఒత్తిడిని తగ్గిస్తుంది. కాళ్లల్లో ఉబ్బు లేదా వాపు, అలసట, వెరికోస్ వీన్స్ వంటి సమస్యలను నివారిస్తుంది.

పరిశోధనల ప్రకారం ఈ 'మస్కులర్ పంప్' విధానం రక్త నాళాల ఆరోగ్యాన్ని కాపాడుతుంది. అయితే దీర్ఘకాలంపాటు తరచుగా స్థిరంగా కూర్చునే లేదా నిలబడే అలవాట్లు, సరైన భంగిమలో నిలబడకపోవడం లేదా కూర్చోకపోవడం వంటి కారణాలవల్ల ఈ సెకండ్ హార్ట్ దెబ్బతింటుంది. అంటే పిక్క కండరాలు బలహీనమవుతాయి. కాబట్టి అలా జరగకూడదంటే.. తరచుగా కూర్చొని లేదా నిలబడి పనిచేసే అవసరం ఉన్నవారు ప్రతీ 40 నిమిషాలకు లేదా ఒక గంటకు ఒకసారి విరామం తీసుకొని కాసేపు వాకింగ్ చేయడం వల్ల సెకండ్ హార్ట్ ఆరోగ్యంగా ఉంటుంది. దీంతోపాటు పిక్కల రైజెస్ (కాల్ఫ్ రైజెస్), అంకుల్ సర్కిల్స్ లేదా కూర్చుని హీల్ లిఫ్ట్స్ చేయడం వంటి వ్యాయామాలు కూడా మంచి ప్రయోజనం కలిగిస్తాయి. కంప్రెషన్ సాక్స్ సహాయపడినప్పటికీ, కదలికలే ఉత్తమమైన వ్యాయామంగా, ఔషధంగా నిపుణులు పేర్కొంటున్నారు. అయితే కాళ్లలో ముఖ్యంగా పిక్క కండరాల్లో నిరంతర వాపు, నడకలో నొప్పి, చర్మంలో మార్పులు, తిమ్మిరి లేదా తరచుగా చల్లని అనుభూతి వంటి లక్షణాలు కనిపిస్తే మాత్రం వెంటనే వైద్య నిపుణులను సంప్రదించాలి. ఎందుకంటే ఇవి మీ సెకండ్ హార్ట్ బలహీనపడిందనడానికి సంకేతాలు.

# పిల్లలకు నెబ్యులైజర్ ఎప్పుడు, ఏం టైంలో పెట్టాలో తెలుసా



స్పోర్ట్స్ న్యూస్, 25 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): పిల్లలకు జలుబు, దగ్గు వంటి సమస్యలు రావడం చాలా సాధారణం. ఈ సమస్యల సమయంలో కొంతమంది పిల్లలకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగవచ్చు. అటువంటి సందర్భాల్లో డాక్టర్ల సలహా మేరకు నెబ్యులైజర్‌ను ఉపయోగించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అయితే నెబ్యులైజర్‌ను ఎప్పుడు పెట్టాలనే విషయంలో తల్లిదండ్రులు చాలాసార్లు గందరగోళానికి గురవుతుంటారు.

సాధారణంగా పిల్లలకు జలుబు, దగ్గు వచ్చినప్పుడు శ్వాసలో ఇబ్బంది, గురక, వీజింగ్ (శ్వాస తీసుకునే సమయంలో శబ్దం రావడం) వంటి లక్షణాలు కనిపించవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో డాక్టర్ సూచనతో నెబ్యులైజర్‌ను ఉపయోగిస్తారు. అయితే ప్రతి సారి జలుబు లేదా దగ్గు వచ్చినపుడు నెబ్యులైజర్ అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. జలుబు, దగ్గు పిల్లల్లో సర్వసాధారణమే అయినప్పటికీ, నెబ్యులైజర్ ఇవ్వాలా లేదా ఆవిరి సరిపోతుందా అనే సందేహం చాలా మంది తల్లిదండ్రుల్లో ఉంటుందని ఆయన తెలిపారు.


నెబ్యులైజర్ అనేది మందులను అందించే ఒక వైద్య పరికరమని డాక్టర్ సందీప్ గుప్తా తెలిపారు. ఇది ద్రవ రూపంలోని మందులను అతి చిన్న కణాలుగా విడగొట్టి, అవి నేరుగా పిల్లల ఊపిరితిత్తుల్లోకి చేరేలా చేస్తుంది. ఈ మందు కణాలు ఊపిరితిత్తుల్లోని వాపును తగ్గించడంలో, అధిక శ్లేష్మం ఉత్పత్తిని నియంత్రించడంలో సహాయపడతాయి. నెబ్యులైజర్ మందులు ఊపిరితిత్తుల లోపల లోతుగా పనిచేస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆస్తమా, బ్రోన్కియోలిటిస్, బ్రోన్కైటిస్, శ్వాసలో గురక, శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది వంటి శ్వాసకోశ సంబంధిత సమస్యల్లో నెబ్యులైజర్లు మరింత ప్రభావవంతంగా పనిచేస్తాయని తెలిపారు.అయితే నెబ్యులైజర్‌ను ఎల్లప్పుడూ వైద్యుని పర్యవేక్షణలోనే ఉపయోగించాలని నిపుణులు సూచిస్తున్నారు. నెబ్యులైజర్‌లో ఉపయోగించే మందులు సరైన మోతాదులో ఉండటం చాలా అవసరమని తెలిపారు.

# ఈ సీజన్‌లో కళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవాలంటే.. వీటిని తినాలి..!

స్పోర్ట్స్ న్యూస్, 25 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): మన శరీరంలో అనేక అవయవాలలో కళ్లు కూడా ఒకటి. కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరం. ముఖ్యంగా ఈ కాలంలో కళ్లను మరింత జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఈ కాలంలో సెలవుల కారణంగా అలాగే వారు చేసే పనుల రీత్యా చాలా మంది బయట ఎక్కువగా గడుపుతూ ఉంటారు. దీంతో సూర్య కిరణాలు కళ్లపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి. దీంతో కళ్లు పొడిబారడం, కళ్లల్లో మంట, దురద వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. అలాగే బలమైన సూర్యకిరణాల కారణంగా కంటి చూపు తగ్గే అవకాశం ఉంటుంది. కనుక ఈ కాలంలో కళ్ల ఆరోగ్యం గురించి మరిన్ని జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం. మనం తీసుకునే కొన్ని రకాల ఆహారాలు ఈ కాలంలో కళ్ల ఆరోగ్యం, చూపు దెబ్బతినకుండా కాపాడడంలో సహాయపడతాయి. ఈ సీజన్‌లో కళ్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మనం తీసుకోవాల్సిన ఆహారాల గురించి పోషకాహార నిపుణులు వివరాలను వెల్లడిస్తున్నారు.

ఉసిరి, క్యారెట్..

ఉసిరికాయ.. దీనిని ఆమ్లా, ఇండియన్ గూస్‌బెర్రీ అని కూడా అంటారు. దీనిలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల ఫ్రీ రాడికల్స్ వల్ల కంటికి కలిగే నష్టాన్ని నివారించవచ్చు. అంతేకాకుండా ఉసిరికాయలను తీసుకోవడం వల్ల కంటి చూపు పెరుగుతుంది. కంటిశుక్లాలు కూడా నిరోధించబడతాయి. క్యారెట్ లలో బీటాకెరోటీన్ ఉంటుంది. ఇది మన శరీరంలోకి ప్రవేశించిన తరువాత విటమిన్ ఎ గా మారుతుంది. కంటి ఆరోగ్యానికి విటమిన్ ఎ చాలా అవసరం. క్యారెట్స్ ను తీసుకోవడం వల్ల కంటి చూపు మెరుగుపడుతుంది. రేచీకటి సమస్య తగ్గుతుంది. కంటి ఇన్ఫెక్షన్ లు, కంటిశుక్లాలు వచ్చే అవకాశం కూడా తక్కువగా ఉంటుంది. వేసవికాలంలో వీటిని తీసుకోవడం వల్ల కంటి ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది.



ఆకుకూరలు, చేపలు..

పాలకూరలు, తోటకూర, కొల్లార్డ్ గ్రీన్స్ వంటి ఆకుకూరలు కంటి ఆరోగ్యాన్ని కాపాడంలో మనకు ఎంతగానో సహాయపడతాయి. ఈ ఆకుకూరలను తీసుకోవడం వల్ల వృద్ధుల్లో వచ్చే అంధత్వం సమస్యలు తగ్గుతాయి. బాదంపప్పులో విటమిన్ ఇ అధికంగా ఉంటుంది. ఇది ఫ్రీ రాడికల్స్ నుండి కంటి ఆరోగ్యాన్ని కాపాడంలో సహాయపడుతుంది. బాదంపప్పును తీసుకోవడం వల్ల కంటిచూపు మెరుగుపడుతుంది. వయసు సంబంధిత కంటి సమస్యలు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది. సాల్మన్, మాకెరెల్, ట్యూనా వంటి చేపల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువగా ఉంటాయి. ఈ ఫ్యాటీ యాసిడ్లు చక్కటి కంటి ఆరోగ్యానికి చాలా అవసరం. డ్రై ఐ సిండ్రోమ్ ను తగ్గించడంలో కంటి శుక్లాల ప్రమాదాన్ని తగ్గించడంలో, కంటిచూపును పెంచడంలో ఇవి ఎంతో ఉపయోగపడతాయి.

పండ్లు..

నారింజ, నిమ్మకాయలు, ద్రాక్ష వంటి పండ్లల్లో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. కళ్ల ఆరోగ్యాన్ని కాపాడడంలో, కంటికి రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాల ఆరోగ్యాన్ని కాపాడంలో విటమిన్ సి మనకు ఎంతగానో సహాయపడుతుంది. ఈ పండ్లను వేసవి కాలంలో తీసుకోవడం వల్ల కళ్ల ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు శరీరానికి కూడా ఎంతో మేలు కలుగుతుంది. కోడిగుడ్లల్లో లుటీన్, జియాక్సంతిన్ వంటి పోషకాలు ఉంటాయి. వయసు పైబడడం వల్ల వచ్చే కంటిచూపు క్షీణతను తగ్గించడంలో ఇవి ఎంతగానో సహాయపడతాయి. కోడిగుడ్లను తీసుకోవడం వల్ల కంటిచూపు మెరుగుపడుతుంది. టమాటాల్లో లైకోపీన్ అధికంగా ఉంటుంది. కంటిచూపును మెరుగుపరచడంలో, ఎండ వల్ల కంటికి కలిగే నష్టాన్ని నివారించడంలో ఇది ఎంతగానో సహాయపడుతుంది. టమాటాలను తీసుకోవడం వల్ల ఎండ వల్ల చర్మానికి కలిగే నష్టం కూడా తగ్గుతుంది. ఇక ఈ ఆహారాలను తీసుకోవడంతో పాటు రోజూ 8 గ్లాసుల నీటిని తప్పకుండా తీసుకోవాలి. నీటిని తాగడం వల్ల డీహైడ్రేషన్ తగ్గి కళ్ల పొడిబారకుండా ఉంటాయి. ఈ విధంగా నీటిని తాగుతూ ఆయా ఆహారాలను తీసుకోవడం వల్ల కళ్లకు హాని కలగకుండా ఉంటుంది.

# ఐపీఎల్ 2026.. ఆర్సీబీ జట్టుకు ఊహించని షాక్ !




స్పోర్ట్స్ న్యూస్, 25 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): : ఐపీఎల్ 2026 టోర్నమెంట్ నేపథ్యంలో రాయల్ ఛాలెంజర్స్ జట్టుకు ఊహించని ఎదురు దెబ్బ తగిలినట్లు తెలుస్తోంది. ఈ టోర్నమెంట్ ప్రారంభ మ్యాచ్ లకు విరాట్ కోహ్లీ దూరమవుతాడని నేషనల్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. తన ఫ్యామిలీతో గడిపేందుకు గాను మార్చిలో స్పెషల్ షెడ్యూల్ పెట్టుకున్నాడట విరాట్ కోహ్లీ. అందుకే ఐపిఎల్ 2026 ప్రారంభ మ్యాచ్ లకు విరాట్ కోహ్లీ దూరం కాబోతున్నాడని టాక్ నడుస్తోంది.

అయితే ఏప్రిల్ నుంచి విరాట్ కోహ్లీ అందుబాటులో ఉంటాడట. ఈ మేరకు త్వరలోనే దీనిపై ప్రకటన కూడా రానున్నట్లు తెలుస్తోంది. ఇది ఇలా ఉండగా ఐపీఎల్ 2026 టోర్నమెంట్ మార్చి 15వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని ప్రచారం జరిగింది. అయితే ఇప్పుడు కొత్తగా షెడ్యూల్ మార్చారట. మార్చి 26వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు ఐపీఎల్ 2026 టోర్నమెంట్ నిర్వహించాలని కౌన్సిల్ నిర్ణయం తీసుకుందట.

## ‘ఖేల్ రత్న’కు హార్దిక్ పేరు సిఫార్సు.. అర్జున అవార్డుకు తెలుగమ్మాయి పేరు షార్ట్‌లిస్ట్



స్పోర్ట్స్ న్యూస్, 25 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): ఈ ఏడాది జాతీయ క్రీడా అవార్డులకు సెలెక్షన్ కమిటీ బుధవారం ఆటగాళ్ల పేర్లను షార్ట్ లిస్ట్ చేసింది. భారత పురుషుల హాకీ జట్టు వైస్ కెప్టెన్ హార్దిక్ సింగ్‌ను భారత అత్యున్నత క్రీడా పురస్కారం మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్నకు సిఫార్సు చేసింది. భారత హాకీ జట్టులో మిడ్‌ఫీల్డర్ హార్దిక్ కీలక సభ్యుడు. 2021 టోక్యో, 2024 పారిస్ ఒలింపిక్స్‌ల్లో భారత్ పతకాలు గెలిచిన జట్టులో అతను భాగం. ఈ ఏడాది ఆసియా కప్ గెలిచిన జట్టులోనూ సభ్యుడు. ఈ ఏడాది అతనొక్కడినే సిఫార్సు చేయడం గమనార్హం. గతేడాది డి. గుకేశ్, హర్మన్‌ప్రీత్ సింగ్, ప్రవీణ్ కుమార్, మను బాకర్‌లకు ఖేల్ రత్న ప్రదానం చేశారు. దేశ రెండో అత్యున్నత క్రీడా పురస్కారం అయిన అర్జున అవార్డుకు సెలెక్షన్ కమిటీ 24 మంది అథ్లెట్లను షార్ట్‌లిస్ట్ చేసింది.

తెలుగమ్మాయి, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి గాయత్రి గోపిచంద్ అర్జున అవార్డుకు నామినేట్ అయ్యింది. మహిళల డబుల్స్‌లో ఆమె భాగస్వామి ట్రీసా జాలీ పేరు కూడా ఉంది. భారత చెస్ ప్లేయర్లు దివ్య దేశ్‌ముఖ్, విదిత్ గుజరాతీ, బాక్సర్ నరేందర్, హాకీ ప్లేయర్లు రాజ్‌కుమార్ పాల్, లాల్రెమ్సియామి, షూటర్లు అఖిల్, మెహులి ఘోష్, కబడ్డీ ప్లేయర్లు సుర్జీత్, పూజ, ఖోఖో క్రీడాకారిణి నిర్మల భటి, డెఫ్ షూటర్ శ్రీకాంత్, పారా షూటర్ రుద్రాన్ష్, రోయర్ అర్వింద్ సింగ్, జిమ్నాసిస్ట్ ప్రణతి నాయక్, టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి సుతీర్థ ముఖర్జీ, పోలో ప్లేయర్ పద్మనాభ్ సింగ్, రెజ్లర్ సోనమ్ మాలిక్ పేర్లను సెలెక్షన్ కమిటీ ప్రతిపాదించింది. అథ్లెటిక్స్ నుంచి తేజస్విన్ శంకర్, ప్రియాంక, మహ్మద్ అఫ్జల్, ఎక్తా భ్యాన్(పారా అథ్లెటిక్స్)లు కూడా అర్జున అవార్డుకు సిఫార్సు అయ్యారు. ఇక యోగా నుంచి తొలిసారిగా ఆర్తి పేరును అర్జున అవార్డుకు సిఫార్సు చేశారు. అయితే, క్రీడా అవార్డుల షార్ట్‌లిస్ట్‌లో ఒక్క క్రికెటర్ పేరు కూడా లేకపోవడం గమనార్హం. 2023లో ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీనే అర్జున అవార్డు అందుకున్న చివరి క్రికెటర్.

# గోల్ఫ్ క్వీన్.. శిక్షా జైన్.!




స్పోర్ట్స్ న్యూస్, 25 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): ఉత్సాహం.. ఆసక్తి ఉంటే వయసుతో సంబంధం లేకుండా దేంట్లోనైనా రాణించొచ్చు. జైపూర్‌కు చెందిన శిక్షా జైన్ వయసు కేవలం 14 ఏండ్లు మాత్రమే. కానీ ఆమె గోల్ఫ్‌లో దూసుకెళ్తోంది. ఇప్పటికే 90కి పైగా టోర్నమెంట్లు గెలిచింది.

ఏడేళ్ల వయసులోనే..

శిక్షా సూరత్‌లో పుట్టింది. ప్రస్తుతం జైపూర్‌లో ఉంటూ చండీగఢ్‌లో అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ తీసుకుంటోంది. చిన్నప్పటి నుంచి శిక్షా వాళ్ల నాన్నతో కలిసి రంబాగ్ గోల్ఫ్ క్లబ్‌కు వెళ్లేది. అప్పుడామె వయసు ఏడేళ్లు. నాన్నను చూస్తూ ఆటపై ఆసక్తి పెరిగి తనకూ గోల్ఫ్ కొట్టాలనిపించేది. అలా ఏడేళ్ల వయసులోనే గోల్ఫ్ షాట్ కొట్టింది. ఆ శబ్దం.. దూరం చూసి అందరూ ఆశ్చర్యపోయారు. అలా గోల్ఫ్‌తో ప్రేమలో పడిన శిక్ష.. ఇటీవల అహ్మదాబాద్.. ఢిల్లీలో పోడియం ఫినిష్ సాధించింది. బంగ్లాదేశ్.. థాయిలాండ్.. దక్షిణాఫ్రికా ఛాంపియన్‌షిప్‌లకు అర్హత సాధించింది.

సమర్థవంతంగా ఎదుర్కుంటూ..

దేశంలో తన వయసు విభాగంలో టాప్–3లో ఉంది శిక్ష. అయినా దాంతోనే సంతృప్తి పడాలనుకోవడం లేదు. ఇంతే స్ఫూర్తితో కొనసాగుతూ 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో భారత త్రివర్ణ పతాకం పైకెగరేయడమే తన లక్ష్యంగా పెట్టుకుంది. ఆ దిశలో ప్రాక్టీస్ చేస్తోంది. ఉదయం 5 గంటలకు నిద్రలోంచి లేస్తుంది. తర్వాత ఫిట్‌నెస్ ట్రైనింగ్.. టెక్నికల్ స్ట్రాటజీ.. స్ట్రెంగ్త్ అండ్ కండిషనింగ్.. ఫిజియోథెరపీ ఇవన్నీ డైలీ షెడ్యూల్‌లో ఉంటాయి. హోంవర్క్.. క్లాస్ వర్క్ ఏంటనేది క్లాస్ టీచర్ వాట్సాప్‌లో పంపిస్తుంది. సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కుంటేనే జీవితంలో విజయం సాధిస్తామనేది తన అభిప్రాయం.

పీరియడ్స్ వచ్చాయి..

శిక్ష సక్సెస్‌లో పేరెంట్స్ పాత్ర కీలకమైంది. మొదటి టోర్నమెంట్‌లో పాల్గొన్నప్పుడు తన వయసు ఎనిమిదేళ్లు. శిక్ష చాలా భయపడింది. ఆ సమయంలో తన పేరెంట్సే ప్రోత్సాహం ఇచ్చారు. ధైర్యాన్ని నూరిపోశారు. ఇప్పటికీ ప్రతీ మ్యాచ్‌కు వాళ్లే తోడుగా ఉంటారు. గోల్ఫ్.. కేవలం శారీరక ఆట కాదు. అదొక మానసిక భావోద్వేగ ఆట. ఒక టోర్నమెంట్‌లో తనకు పీరియడ్స్ వచ్చాయి. శరీరం సహకరించలేదు. కానీ “పీరియడ్స్ అనేది సాధారణమైన విషయం.. దానివల్ల ఆటను వదులుకోవద్దు” అని తల్లిదండ్రులు ఇచ్చిన మద్దతే ఇప్పటికీ తనను ఛాంపియన్‌గా నిలబెడుతోంది.

లక్ష్యం 2028..

ప్రస్తుతం వరల్డ్ అమెచ్యూర్ గోల్ఫ్ ర్యాంకింగ్స్‌లో చోటు సంపాదించింది. ఎన్ని జాతీయ టోర్నమెంట్లు ఆడగలిగితే అన్నీ ఆడుతోంది. కానీ.. తన మొదటి లక్ష్యం ఆసియా గేమ్స్‌లో బంగారు పతకం. అది 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో జరగనుంది. నీరజ్ చోప్రా నమ్రత.. అదితి అశోక్ నుంచి ప్రేరణ పొంది ఆటలో అదరగొట్టే ప్రతిభను చాటుతోంది. సోషల్ మీడియాలో ఎక్కువ మంది యువ అథ్లెట్లు ఉన్నారు. కొందరు ప్రశంసిస్తారు.. కొందరు విమర్శిస్తారు. ప్రశంసించినా.. తిట్టినా పట్టించుకోదు శిక్ష. తన లక్ష్యం కోసం కష్టపడుతూ ముందుకు సాగుతోంది. తనకు స్నేహితులు కూడా తక్కువే కాబట్టీ సమయం వృథా కాదు.

# కోహ్లీ కోసం చెట్టెక్కిన అభిమానులు



స్పోర్ట్స్ న్యూస్, 25 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లో బెంగళూరులో ఢిల్లీ, ఆంధ్ర జట్లు తలపడగా ఢిల్లీ నాలుగు వికెట్ల తేడాతో గెలిచిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా స్టార్ విరాట్ కోహ్లీ 101 బంతుల్లో 131 పరుగులతో అద్భుత సెంచరీ సాధించాడు. అయితే ఈ మ్యాచ్ లకు లైవ్ ప్రసారం లేకపోవడం, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రౌండ్‌లో గేట్లు తెరవకపోవడంతో అభిమానులు తీవ్ర నిరాశ చెందారు. భద్రతా కారణాల వల్ల కర్ణాటక ప్రభుత్వం ఎం.చిన్నస్వామి స్టేడియానికి అనుమతి ఇవ్వకపోవడంతో కేఎస్‌సీఏ ఈ మ్యాచ్‌ను COE కి మార్చింది.

అయితే ఎలాగైనా మ్యాచ్ చూడాలని కొంతమంది అభిమానులు చెట్లపైకి ఎక్కి కోహ్లీ బ్యాటింగ్‌ను చూసారు. అయితే ఇలా అభిమానులు చెట్లెక్కి మ్యాచ్ తిలకించడం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. టాప్ ఆటగాళ్లు ఆడే మ్యాచ్‌లకైనా ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేయాలని అభిమానులు బీసీసీఐని డిమాండ్ చేస్తున్నారు.

# సినిమా న్యూస్

## డార్లింగ్ ఫ్యాన్స్‌కు క్రిస్మస్ ట్రీట్

### ‘ది రాజా సాబ్’ నుండి మ్యూజికల్ సర్ప్రైజ్!




యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న లేటెస్ట్ హర్రర్ కామెడీ ఎంటర్టైనర్ ‘ది రాజా సాబ్’. టాలెంటెడ్ డైరెక్టర్ మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా చిత్రంపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని చిత్ర యూనిట్ ఒక స్పెషల్ గిఫ్ట్‌ను అభిమానులకు అందించింది. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఈ చిత్ర నిర్మాణ సంస్థ ‘పీపుల్ మీడియా ఫ్యాక్టరీ’ ఒక బ్యూటిఫుల్ మ్యూజికల్ సర్ప్రైజ్‌ను విడుదల చేసింది. ‘రాజే యువరాజే..’ అంటూ సాగే పాట ప్రోమోను రిలీజ్ చేస్తూ, ప్రభాస్ వింటేజ్ లుక్స్‌తో ఫ్యాన్స్‌ను ఖుషీ చేసింది. ఈ పాటలో థమన్ అందించిన సంగీతం మ్యాజికల్ గా ఉందని సోషల్ మీడియాలో చర్చ నడుస్తుంది. ఈ సినిమాలో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ ముగ్గురు భామలు నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని జనవరి 9న గ్రాండ్‌గా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతుంది చిత్రబృందం.

# ‘దేవర 2’పై కొత్త ట్విస్ట్

## మళ్లీ ట్రాక్‌లోకి ఎన్టీఆర్-కొరటాల సీక్వెల్..?

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ ప్రస్తుతం వరుస భారీ సినిమాలతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆయన లైనప్‌లో ఒకప్పుడు హాట్ టాపిక్‌గా మారిన అవైటెడ్ సీక్వెల్ ‘దేవర 2’ కూడా ఉండటం అభిమానుల్లో భారీ అంచనాలు రేపింది. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన ‘దేవర’ పార్ట్ 1 మంచి విజయం సాధించడంతో, రెండో భాగం కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూశారు. అయితే కొంతకాలంగా ‘దేవర 2’పై స్పష్టత లేకపోవడం గందరగోళానికి దారి తీసింది. సీక్వెల్ ఉంటుందా? ఉండదా? అన్న సందేహాలు నెలకొన్నాయి. మధ్యలో కొన్ని రోజులు సీక్వెల్ లేదన్న టాక్ బలంగా వినిపించడంతో, అభిమానుల్లో నిరాశ కూడా వ్యక్తమైంది.

ఆ తర్వాత దాదాపుగా ఈ ప్రాజెక్ట్ క్లోజ్ అయిందనే ప్రచారం జరిగింది. కానీ తాజా సమాచారం ప్రకారం ‘దేవర 2’ మళ్లీ ట్రాక్‌లోకి వచ్చే అవకాశాలు ఉన్నాయన్న వార్తలు ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతున్నాయి. కొరటాల శివ తాజాగా సిద్ధం చేసిన కొత్త వెర్షన్ ఎన్టీఆర్‌కు నచ్చినట్లు టాక్ వినిపిస్తోంది. మారిన సమీకరణాలతో సీక్వెల్‌పై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఈసారి కథ, స్క్రిప్ట్ పరంగా మరింత బలమైన అవుట్‌పుట్‌తో ముందుకు వెళ్లాలని దర్శకుడు కొరటాల భావిస్తున్నాడని, ఎన్టీఆర్ కూడా సంతృప్తిగా ఉన్నాడన్న రూమర్స్ అభిమానులను ఉత్సాహపరుస్తున్నాయి. దీంతో ‘దేవర 2’ ఆగమనం దాదాపు ఖాయమన్నట్టే అనే టాక్ ఇప్పుడు వినిపిస్తోంది.




అయితే ఈ వార్తలపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. అందువల్ల ‘దేవర 2’పై పూర్తి స్పష్టత రావాలంటే మేకర్స్ నుంచి అధికారిక అప్‌డేట్ వచ్చే వరకు వేచి చూడాల్సిందే. అప్పటివరకు ఈ సీక్వెల్ చుట్టూ ఆసక్తికరమైన చర్చ కొనసాగనుంది. ఇక ఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో డ్రాగన్ అనే చిత్రం చేస్తున్నాడు. ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ఈ మూవీ తర్వాత ఎన్టీఆర్.. త్రివిక్రమ్ దర్శకత్వంలో మూవీ చేయనున్నాడు.

## జైలర్ నటుడికి ప్రమాదం పరిస్థితి విషమం



మలయాళం నటుడు, ‘జైలర్’ ఫేమ్ వినాయకన్ ప్రమాదానికి గురయ్యారు. వినాయకన్ నటిస్తున్న ‘ఆడు 3’ సినిమా షూటింగ్ సమయంలో ప్రమాదానికి గురయ్యి, తీవ్రంగా గాయపడ్డారు. తొడుపుజలో యాక్షన్ సన్నివేశాల సంబంధించిన స్టంట్ చేస్తూ ప్రమాదానికి గురి కాగా.. సిబ్బంది హుటాహుటిన కొచ్చిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. భుజం, మెడలో నరాలు, కండరాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. సమయానికి ఆసుపత్రికి చేర్చడంతో వైద్యులు నరాల డ్యామేజ్‌ను గుర్తించారు. దీంతో ఆయన తీవ్ర పక్షవాతం నుంచి తప్పించుకున్నారని వైద్యులు వెల్లడించారు. డాక్టర్లు ఆరు వారాల పూర్తి విశ్రాంతి సూచించడంతో ‘ఆడు 3’ షూటింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. జయసూర్య హీరోగా నటిస్తున్న ఈ ఎపిక్ ఫాంటసీ చిత్రాన్ని మిధున్ మాన్యువల్ థామస్ దర్శకత్వం వహిస్తున్నారు. వినాయకన్ త్వరగా కోలుకుని మళ్లీ సెట్స్‌కు రావాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.



## 12 రోజులు నరకం చూశా.. కుటుంబంతో పారిపోదామనుకున్నా

టాలీవుడ్ నటుడు నందు ‘సైక్ సిద్ధార్థ’ సినిమాతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఇది కామెడీ, రొమాన్స్, సోషల్ సాటిర్ అంశాలతో కూడిన డార్క్ కామెడీ డ్రామాగా రాబోతుండగా..యామిని భాస్కర్ హీరోయిన్‌గా నటిస్తోంది. వరుణ్ రెడ్డి దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 1న విడుదల కాబోతుంది. అప్పుడే ప్రమోషన్స్ స్టార్ట్ చేసిన నందు తన పర్సనల్ విషయాలు తెలుపుతూ ఎమోషనల్ అయ్యాడు. తనపై తప్పుడు వార్తలు వచ్చినప్పుడు ఇతర దేశానికి పారిపోవాలనుకున్నట్లు షాకింగ్ కామెంట్స్ చేశాడు. “నేను ఈ ఫీల్డ్‌లో లేకపోతే నా అలాంటి పుకార్లు వచ్చేవి కాదు.

మనకు బ్యాక్‌గ్రౌండ్ లేకుంటే మనం ఏం చేయలేమని సంబంధం లేని అంశాల్లో మన పేర్లు చేరుస్తారు. నేను చేయని పనికి నా మీద ఆరోపణలు వచ్చాయి. దీంతో చాలామంది నానారకాలుగా మాట్లాడుకున్నారు. నిజాలు తెలుసుకోకుండా.. జరిగిందేంటి అనేది ఆలోచించకుండా నా గురించి తప్పుగా అనుకున్నారు. ఆ సమయంలో నాతో పాటు నా కుటుంబం చాలా బాధపడింది. అప్పుడు నా భార్య గీతా మాధురి ఇక్కడ ఉండలేకపోతున్నాం. అన్ని వదిలేసి వేరే దేశానికి వెళ్లి హొటల్లో పని చేసుకుందామని చెప్పింది. ఆ మాటలు గుర్తు చేసుకుంటూ ఇప్పటికీ కన్నీళ్లు వస్తాయి” అని చెప్పుకొచ్చాడు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.